
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నంద్యాల
జిల్లా వార్తలు
5
గురువారం 10 జులై 2025



నేడు శాకంబరి అలంకరణలో భ్రామరి

నంద్యాల టౌన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీశైలంలోని భ్రమరాంబ అమ్మవారు గురువారం శాకంబరి అలంకరణలో దర్శనమివ్వనున్నారు. ఈ వేడుక కోసం ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అమ్మవారి అలంకరణకు ఇప్పటికే 3వేల కిలోలకు పైగా కూరగాయాలు, వంద గుమ్మడికాయలు, రెండువేలకు పైగా నిమ్మకాయలు, 600 ఆరకూర కట్టలు, వివిధ రకాల పండ్లు, పత్రాలు తెప్పించినట్లు ఈవో శ్రీనివాసరావు తెలిపారు.

అరటి రైతుకు గుడ్ న్యూస్



అరటితోట

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): వాతావరణ ఆధారిత బీమా కింద అరటి పంట ఎంపికైనట్లు జిల్లా ఉద్యానశాఖ అధికారి నాగరాజు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో అత్యధికంగా సాగవుతున్న అరటి పంటకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ఖరీఫ్ సంవత్సరానికి గాను వాతావరణ ఆధారిత బీమా కింద అరటిని ఎంపిక చేశాయన్నారు. అరటి రైతులు ఇన్సూరెన్స్ కోసం పట్టాదారు పాస్‌పుస్తకం ఫొటోస్టాట్, పంట సాగు చేసినట్లు వీఏఏ లేదా వీహెచ్‌ఏ, వీఎస్‌ఏ తదితర పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వీటితో పాటు గుర్తింపు పొందిన బీమా సంస్థకు రూ.2,750(ఎకరాకు) చెల్లించినట్లు వివరాలు ఉండాలన్నారు. జూలై 15వ తేదీలోపు అరటి సాగు చేసిన రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాల కోసం స్థానికంగా ఉన్న ఆర్బీకేలో, వ్యవసాయ శాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

వెలుగోడులో అత్యధిక వర్షపాతం

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల మంగళవారం రాత్రి విస్తారంగా వర్షాలు కురిశాయి. వెలుగోడు మండలంలో అత్యధికంగా 15.4 మిల్లీమీటర్ల మేర వర్షపాతం నమోదైంది. అలాగే గడివేములలో 13.6, బేతంచర్లలో 11.2, గోస్పాడులో 10.2, శిరివెళ్లలో 10, బండిఆత్మకూరులో 9.8, మహానందిలో 9.2, కొత్తపల్లెలో 8.4, పగిడ్యాలలో 6.8, రుద్రవరంలో 6 మి.మీ., వర్షం కురిసింది. అదేవిధంగా నంద్యాల పట్టణం 6మి.మీ., నంద్యాలరూరల్‌లో 5.6, డోన్‌లో 4.8, నందికొట్కూరులో 4.6, ఆత్మకూరులో 3.8, శ్రీశైలంలో 3.8, జూపాడుబంగ్లాలో 3.6, పాములపాడులో 3.4, మిడ్తూరులో 3.2, బనగానపల్లెలో 3మి.మీ., వర్షపాతం నమోదైంది.

నేడు గురు పౌర్ణమి



నంద్యాల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): గురువును త్రిమూర్తుల స్వరూపంగా భావిస్తూ నిర్వహించుకునే వేడుక 'గురు పౌర్ణమి'ని గురువారం జిల్లా వాసులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోనున్నారు. ఈ ఏడాది గురు పౌర్ణమి గురువారం రోజునే రావడం ప్రత్యేక విశేషంగా భక్తులు భావిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లోని షిరిడీ సాయిబాబా దేవాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. గురు పౌర్ణమిని వ్యాస పౌర్ణమిగానూ పేర్కొంటారు. ఇదే రోజున వేదవ్యాస మహర్షి జన్మతిథి కావడంతో, వేదాలు లోకానికి అందించిన వ్యాస భగవానుడిని ఈ వేడుకలో ప్రత్యేకంగా పూజిస్తారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని షిరిడీ సాయిబాబా దేవాలయాల్లో, దత్తాత్రేయ మందిరాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. సాయిబాబా దేవాలయాల్లో, దత్తాత్రేయ మందిరాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నంద్యాల పట్టణంలోని ప్రముఖ ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలు, అన్నదాన, భజన కార్యక్రమాలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు.



- గోదాములకు చేరుతున్న వేల బస్తాల ఎరువులు
- షాపుల వరకే పరిమితమైన విజిలెన్స్ దాడులు
- ఆందోళనలో రైతాంగం
- సరిపడా నిల్వలున్నాయంటున్న అధికారులు

నిల్వలు- వదంతులు

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ పంట మొలకెత్తనే లేదు. అప్పుడే ఎరువుల కోసం రైతులు ఆందోళనపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. తెలంగాణలో ఎరువులు కొరత అని వదంతులను ఆసరాగా చేసుకున్న వ్యాపారులు గోదాముల్లో ఎరువులు నిల్వ చేసి కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. తద్వారా బ్లాక్‌మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయించేందుకు పావులు కదుపుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఖరీఫ్ సాగులో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై వ్యవసాయాధికారులు ఒక్క సమీక్షా సమావేశం కూడా నిర్వహించకపోవడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నంద్యాల జిల్లాలో వ్యవసాయ విజిలెన్స్ అధికారుల దాడులు కేవలం షాపుల వరకే పరిమితమయ్యాయి. అధికంగా నిల్వలు చేస్తున్న వ్యాపారులపై ఎలాంటి చర్యలకు ఉపక్రమించడం లేదు. ఖరీఫ్ పంట మొలకెత్తక ముందే డీసీఎంఎస్ ద్వారా 335.035 టన్నులు, ఎఫ్‌పీవోల ద్వారా 105.925 టన్నులు, 32 పీఏసీఎస్‌లకు 3650.995 టన్నులు, ఆర్ఎస్‌కేల ద్వారా 215.46 టన్నులు మొత్తం కలిపి 4307.415 టన్నులు కాంప్లెక్స్ ఎరువులు విక్రయించేశారు. ఈ ఎరువులన్నీ నిజంగానే రైతులకు చేరాయా? లేదా గోదాములకు చేరాయా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తనిఖీ చేయాల్సిన అధికారులు బదిలీల్లో ఉండడం, కొత్తగా వచ్చిన అధికారులు బాధ్యతలు స్వీకరించినా దృష్టిసారించకపోవడంతో ఎరువులు పక్కదారి పడుతున్నాయనే విమర్శలు వస్తున్నాయి. జిల్లాలో ప్రస్తుతం 39,500 హెక్టార్లలో రైతులు వివిధ రకాల పంటలు వేశారు. అందులో అత్యధికంగా మొక్కజొన్న సాగవుతోంది. ఎకరాకు ఐదు బస్తాల నుంచి 10 బస్తాల ప్రకారం ఎరువులు రెండు దఫాలుగా వేసినా 500 నుంచి 800 టన్నులకు మించి అవసరం ఉండదు. కాని ఏకంగా ఒక్క మార్క్‌ఫెడ్ ద్వారానే 4307 టన్నులు అమ్మేశారు. మిగిలిన హోల్‌సేల్, రిటైల్ వ్యాపారుల వద్ద ఉన్న 64154 టన్నుల ఎరువులు నిల్వలు ఉండగా ఎంత మేరకు విక్రయించారో తెలియని పరిస్థితి నెలకొంది.

మార్క్‌ఫెడ్ వద్ద నిల్వ ఉన్న కాంప్లెక్స్ ఎరువులు

మార్క్‌ఫెడ్ వద్ద ఆగస్టు నెలాఖరు వరకు సరిపడా నిల్వలున్నాయి. ఎరువుల కొనుగోళ్లపై నియంత్రణ లేకపోతే కొరత ఏర్పడే అవకాశముంది. యూరియా 5000 టన్నులు అవసరం కాగా 6875 టన్నులు మార్క్‌ఫెడ్ వద్ద నిల్వ వుంది. ఇప్పటికే 2379 టన్నులు విక్రయించారు. డీఏపీ 1200 టన్నులు అవసరం కాగా 815 టన్నులు నిల్వలున్నాయి. ఇప్పటికే 1214 టన్నులు విక్రయించారు. ఎన్‌పీకే 1500 టన్నులు అవసరం కాగా 108 టన్నులు అందుబాటులో ఉంది. ఇప్పటికే 128 టన్నులు విక్రయించారు. ఎంవోపీ 400 టన్నులు అవసరం కాగా నిల్వలు లేవు.



గోదాముల్లో నిల్వ వున్న ఎరువులు

రైతుల అవసరానికి తగ్గ నిల్వలుంచాలి



రైతుల అవసరానికి తగిన విధంగా వ్యవసాయాధికారులు ఎరువుల నిల్వలుంచాలి. యూరియా రూ.290 ఉండగా మార్కెట్‌లో కొరత సృష్టించి రూ.300 నుంచి రూ.350ల వరకు విక్రయిస్తున్నారు. డీఏపీ కూడా అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

\- రాజశేఖర్, రైతుసంఘం నాయకుడు

అవసరం మేరకు కొనండి



రైతుల తమ అవసరం మేరకే ఎరువులను కొనాలి. జిల్లాలో ఎరువుల కొరత లేదు. మండలాల్లో పంట నమోదును బట్టి సమీపంలోని ఆర్ఎస్‌కేల నుంచి ఎరువులు అందజేస్తాము.

\- నున్నా వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయాధికారి, నంద్యాల

ఆందోళన చెందనవసరం లేదు



రైతులు ఆందోళన చెందనవసరం లేదు. వద్దు. ఖరీఫ్ పంటలకు సరిపడా నిల్వలున్నాయి. ఇతర రాష్ట్రాల్లో కొరత ఉందని వస్తున్న వదంతులను రైతులు నమ్మవద్దు.

\- హరినాథరెడ్డి, మార్క్‌ఫెడ్ మేనేజర్, నంద్యాల



షాపుల్లో మాత్రమే స్టాక్ వివరాలు సేకరిస్తున్న విజిలెన్స్ అధికారులు(ఫైల్)

లక్ష్యాలను సాధించాలి

కలెక్టర్ రాజకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర -2047 విజన్ అమల్లో భాగంగా నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో స్వర్ణాంధ్ర - 2047 విజన్ ప్లాన్, జీరో పావర్టీ, పీ4 మార్గదర్శి - బంగారు కుటుంబంపై మోడల్ సర్వేపై కలెక్టర్ నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఇండస్ట్రీ, పంచాయతీరాజ్‌శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర - 2047 విజన్‌లో భాగంగా జిల్లా అభివృద్ధికి అన్ని రంగాల్లో కృషి చేయాలన్నారు. ఆగస్టు 15 నాటికి ఐదు లక్షల బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేలా ప్రభుత్వం కార్యాచరణ నిర్దేశించిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీవో వేణుగోపాల్, ఆర్డీవోలు విశ్వనాథ్, నరసింహులు పాల్గొన్నారు.

మూడు గేట్ల ద్వారా నీటి విడుదల



మూడు గేట్ల నుంచి సాగర్‌కు విడుదలవుతున్న కృష్ణా జలాలు

నంద్యాల టౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి భారీగా వరద ప్రవాహం శ్రీశైలం జలాశయానికి వస్తోంది. జురాల, సుంకేసుల జలాశయాల నుంచి 1,81,051 క్యూసెక్కుల మేర వరద శ్రీశైలం డ్యాంకు వస్తోంది. దీంతో డ్యాం అధికారులు మూడు క్రస్ట్ గేట్లను 10 అడుగుల మేర పైకి ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. స్పిల్‌వే ద్వారా 80,646 క్యూసెక్కులు శ్రీశైలం ఎడమ, కుడి గట్టు జల విద్యుత్తు కేంద్రాల్లో విద్యుత్తు ఉత్పత్తి చేస్తున్నారు. 6,293 క్యూసెక్కులను అదనంగా నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయం నీటి మట్టం 882.40 అడుగులుగా ఉండగా నీటి నిల్వ 201.1205 టీఎంసీలుగా నమోదైంది.

డీసీసీలో అధ్యక్ష గోల..!

- కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు
- నేతల మధ్య కుదరని సయోధ్య
- తాజాగా జిల్లా ఇన్‌చార్జి నియామయం
- నూతన కమిటీ కూర్పుపై సమాలోచనలు



కర్నూలు అర్బన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన పార్టీ అది. కర్నూలు జిల్లా నుంచి రాష్ట్రపతులు, ముఖ్యమంత్రులను అందించిన కాంగ్రెస్ పార్టీ నేడు అంతర్గత కుమ్ములాటలు, నేతల నడుమ వైషమ్యాలతో రచ్చకెక్కింది. జిల్లా అధ్యక్ష పదవి కోసం పోటీ తీవ్రంగానే ఉన్నప్పటికీ సరైన వ్యక్తికి జిల్లా పార్టీ పగ్గాలు అప్పజెప్పేందుకు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఆచితూచి అడుగులేస్తోంది. మొత్తం మీద డీసీసీ పీఠం కోసం కుస్తీ పోరు తారస్థాయికి చేరుకుంది. జిల్లా కాంగ్రెస్ పార్టీని నడిపించే సారథిలేక గత ఐదేళ్ల కాలంలో అధిష్ఠానం ప్రయోగాలు చేసింది. 2024 సార్వత్రిక ఎన్నికల అనంతరం డీసీసీ అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్యే మురళీకృష్ణను పార్టీ ఎంపిక చేసింది. అయితే ఆయన కాంగ్రెస్ పార్టీ కార్యాలయం పేరుతో సొసైటీ ఏర్పాటు చేయడం, అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారన్న ఆరోపణలతో ఆయన్ను పార్టీ హైకమాండ్ తొలగించిన విషయం తెలిసిందే. అప్పటినుంచి జిల్లా సారథి లేకుండానే పార్టీ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇదే క్రమంలో నగర అధ్యక్షుడిని నియమించినప్పటికి పార్టీలో ఎవరికి వారు వర్గాలుగా విడిపోయి చోటా మోటా నాయకులు సైతం డీసీసీ పీఠం కోసం గాంధీ భవన్‌లో పైరవీలు చేస్తున్నారు. పార్టీలో జరుగుతున్న అంతర్గత పోరు వర్గాలుగా చీలిపోయి పార్టీ పరువుతీస్తున్నారని పలువురు నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమైక్యాంధ్ర ఉద్యమం తర్వాత పార్టీ ఒక్కసారిగా కనుమరుగైన విషయం తెలిసిందే. అయినా కూడా కొంత కాలం కీలక నాయకులు పార్టీని నడిపించారు. వైసీపీ పాలనలో కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తున్న కీలక నాయకులెందరో వైసీపీలోకి వెళ్లిన విషయం తెలిసిందే. ఆ క్రమంలో పార్టీని నడిపించే సారథి లేకపోయినప్పటికీ పార్టీ మనుగడ సాగిస్తూ ఉనికిని చాటుతోంది. ప్రముఖుల వర్ధంతులు, జయంతులతో పాటు, రాష్ట్ర, జాతీయ నిరసనలు, ఆందోళనలు కొనసాగున్నాయి.

రూ.20 లక్షల కోసం ఆరాటం..

కాంగ్రెస్ పార్టీకి చెందిన ఆస్తుల ద్వారా ఏడీకి సుమారు రూ.20 లక్షల దాకా ఆదాయం సమకూరుతోంది. దానిపై పెత్తనం చెలాయించేందుకు ఎందరో ఇప్పటికే కుస్తీలు పడుతున్నారు. ఇప్పటి వరకు ఏళ్ల తరబడి పాలించిన నాయకులు పార్టీ ఖాజానాలో ఒక్క పైసా కూడా లేకుండా చేశారు. ఈ క్రమంలో ప్రతి నెలా వచ్చే ఆదాయాన్ని పీసీసీ అకౌంట్లో జమచేయాలని అధిష్ఠానం ఆదేశించింది. డబ్బును పీసీసీ అకౌంట్‌కు జమ చేయడాన్ని వ్యతిరేకిస్తూ జిల్లా నాయకులు తీర్మానాన్ని చేసి పంపారు. పైగా పార్టీకి చెందిన ఆస్తులను కబ్జా చేసేందుకు, దుర్వినియోగం చేసేందుకు కొందరు నాయకులు కుట్రలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీలోని కొందరు నేతలు చెబుతున్నారు.



మిగతా 6వ పేజీలో



పెద్ద పండుగ

- నేడు మెగా పీటీఎం 2.0
- ప్రతి పాఠశాలలో సంబరాలకు సర్వం సిద్ధం
- ప్రభుత్వ స్కూళ్ల బలోపేతం దిశగా ప్రభుత్వం



నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): సమాజంలో భాగస్వామ్యం ఉన్నప్పుడు ఏ రంగమైనా అభివృద్ధి చెందుతుందన్న నమ్మకంతో ప్రభుత్వం ముందుకెళ్తోంది. చేసిన మంచిని ప్రజలకు చెబుతూ.. చేయబోయే అభివృద్ధిని వివరిస్తూ ప్రజా పాలనను కొనసాగిస్తోంది. ఇదే క్రమంలో విద్యాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని గురువారం రాష్ట్ర వ్యాప్తంగా మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ 2.0 నిర్వహణకు శ్రీకారం చుట్టింది. జిల్లాలోని 1,959 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, 80 జూనియర్ కళాశాలల్లో మెగా పేరెంట్స్ ఈవెంట్ నిర్వహిస్తున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు విద్యాపరంగా, ప్రవర్తన పరంగా ఏ స్థాయిలో ఉన్నారో, సమాజ అంశాలపై ఎలాంటి అవగాహన కలిగి ఉన్నారో తెలుసుకునేందుకు ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. విద్యార్థుల ప్రయోజనాల కోసం ఉపాధ్యాయుల నుంచి ఎలాంటి సహకారం కోరుకుంటున్నారో పరస్పరం తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం మంచి వేదిక అని ప్రభుత్వం భావించింది.

మిగతా 6వ పేజీలో

ఆరు ప్రాజెక్టులకు ఓకే.!



కర్నూలు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు అధ్యక్షతన బుధవారం జరిగిన మంత్రివర్గం.. టెండర్లు పూర్తై మొదలు పెట్టని, 25 శాతంలోపు పురోగతి ఉన్న పనులు కూడా కొనసాగించాలని నిర్ణయించింది. దీంతో ఉమ్మడి జిల్లాలో వేదవతి, ఆర్డీఎస్ కుడి కాలువ, రాయలసీమ లిఫ్ట్ సహా రూ.6,581.96 కోట్లు విలువైన ఆరు ప్రాజెక్టులకు మోక్షం లభించింది. ఆలూరు, ఆదోని నియోజకవర్గాల్లో 80 వేల ఎకరాలకు సాగునీరు, 196 గ్రామాలకు తాగునీరు అందించాలనే లక్ష్యంగా వేదవతి ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు చేపట్టారు. 2019 జనవరి 29న రూ.1,942.80 కోట్లు మంజూరు చేస్తూ జీవో. ఆర్‌టీ.నెం.77 జారీ చేసింది. ఫిబ్రవరిలో టెండర్లు కూడా పూర్తి చేసింది. హైదరాబాద్‌కు చెందిన మెఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ సంస్థ 4.69 శాతం అధిక (ఎక్సెస్) రేట్లకు దక్కించుకొని పనులు మొదలు పెట్టారు. రూ.106.2 కోట్లు (6.61 శాతం) పనులు చేశారు. పనులు మొదలు పెట్టాలంటే రూ.395 కోట్లు అవసరం ఉంది. భూసేకరణకు చేసిన ఖర్చు రూ.78 లక్షలు మాత్రమే. అయితే.. 2019 మేలో జగన్ సారథ్యంలో వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. స్టేజ్-1లో పైపులైన్ పనులు, హంద్రీ నీవా కాలువపై స్టేజ్-2 పంప్‌హౌస్ పనులు అసంపూర్తిగా ఆగిపోయాయి. భూసేకరణ, హాలహర్వి, మొలగవెల్లి జలాశయాలు పనులు, ప్రధాన పైపు లైన్ పనులు మొదలే కాలేదు. 2019 జూన్ 12న సీఎం చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం వచ్చాక వీటికి మోక్షం వస్తుందని ఆశిస్తే.. 25 శాతంలోపు పురోగతి ఉన్న పనులు ఆపేయమని ఇచ్చిన జీవో శాపంగా మారింది.

రాయలసీమ లిఫ్ట్‌కు ఓకే

రాయలసీమ దుర్భిక్ష నివారణ మిషన్ (ఆర్‌డీఎంపీ)లో భాగంగా గత వైసీపీ ప్రభుత్వం రాయలసీమ ఎత్తిపోతల పథకం చేపట్టింది. శ్రీశైలం ఫోర్‌షోర్ ఏరియా సంగమేశ్వరం నుంచి రోజుకు 3 టీఎంసీలు ఎత్తిపోసి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ దిగువన శ్రీశైలం కుడిగట్టు ప్రధాన కాలువ (ఎస్ఆర్ఎంసీ)లో వేయాలి. ఈ పనులకు రూ.2020 మే 5న అప్పటి ప్రభుత్వం రూ.3,825 కోట్లు మంజూరు చేస్తూ జీవో ఆర్టీ నంబరు 203 జారీ చేసింది. ఎస్పీఎంఎల్-ఎన్‌సీసీ-మెఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ జాయింట్ వెంచర్‌గా పనులు దక్కించుకొని రూ.3,307.06 కోట్లతో పనులు చేసేందుకు 2021 ఫిబ్రవరి 27న ఒప్పందం చేసుకున్నారు. దాదాపు రూ.745.46 కోట్ల (22.54 శాతం) విలువ చేసే పనులు చేశారు. గత ఎన్నికల ముందు ఈ పనులకు సంబంధించిన బిల్లులు చెల్లింపులపై పెద్ద ఎత్తున రాజకీయ దుమారం రేగింది.

మిగతా 6వ పేజీలో

సంక్షేమం ఎరుగని మత్స్య కార్మికులు

నేడు జాతీయ మత్స్యకారుల దినోత్సవం

7





పారదర్శకంగా పోషకాహారం

- అంగన్‌వాడీల్లో ముఖ ఆధార్ గుర్తింపు
- పౌష్టికాహారం పక్కదారి పట్టకుండా చర్యలు

చాగలమర్రి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందజేసే పౌష్టికాహారం పక్కదారి పట్టకుండా పాదర్శకతకు పెద్దపీట వేసేలా కేంద్ర, మహిళ శిశు సంక్షేమ మంత్రిత్వశాఖ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ముఖ ఆధారిత గుర్తింపును ఆచరణలోకి తీసుకుంది. లబ్ధిదారులకు సరుకులు, ఆహార పంపిణీ సమయంలో ముఖ గుర్తింపు తప్పనిసరి కానుంది. పోషణ్ ట్రాకర్ యాప్ ద్వారా ఈ విధానాన్ని అమలు చేయనున్నారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ విధానాన్ని అమలు చేసినా కొన్ని నెలలుగా నిలిపి వేసింది. తాజాగా కేంద్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రావడంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ విధానాన్ని అమలు చేసింది. అంగన్‌వాడీల్లో నమోదు చేయగానే నేరుగా కేంద్రానికి చేరుతుంది. ప్రతి నెల రెండుసార్లు బాలింతలు, గర్భిణిలకు పౌష్టికాహారం అందిస్తారు. ప్రతి 15 రోజులకు ఒకసారి అంగన్‌వాడీ కేంద్రాల వద్ద హెల్త్ న్యూట్రీషన్ డేను నిర్వహించి వైద్యులు వచ్చి పరీక్షలు చేస్తారు.

బాల సంజీవని యాప్‌లో నమోదు

ప్రస్తుతం బాలసంజీవని యాప్‌లో రాష్ట్ర ప్రభుత్వం గర్భిణిలు, బాలింతలు, 7-3 ఏళ్ల లోపు చిన్నారుల ముఖ గుర్తింపును నమోదు చేస్తోంది. కేంద్ర పర్యవేక్షణలోని పోషణ్ ట్రాకర్ యాప్‌లోను దాన్ని నమోదు చేయనున్నారు. యాప్‌లో ఫొటోతో సహా నమోదవుతుండటంతో క్షేత్రస్థాయిలో ఎలాంటి ఇబ్బందులు ఉండవు. గర్భిణిలు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం పంపిణీ ఏ మేరకు జరుగుతుందో జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి నుంచి పర్యవేక్షించడం సులభమవుతుంది. కొన్ని కేంద్రాల్లో ఇప్పటికే ప్రయోగాత్మకంగా ఈ నమోదును ప్రారం భించారు. మూడేళ్ల నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులకు కేంద్రాల్లో మధ్యాహ్న భోజనం వడ్డించే సమయంలో ఫొటో తీసి ఆ వివరా లను పోషణ్ ట్రాకర్‌లో నమోదు చేయనున్నారు. అంగన్ వాడీలలో గర్భిణిలు, బాలింతలకు ముఖ ఆధారిత గుర్తింపు ఉంటేనే పౌష్టికాహారం అందుతుంది. పౌష్టికాహారం పక్కదారి పట్టకుండా ప్రత్యేక చర్యలు ప్రభుత్వం తీసుకుంటోంది.



గర్భిణులకు అందించే పౌష్టికాహారం

3 కేజీల బియ్యం, కేజి కందిపప్పు, 500 ఎంఎల్ ఆయిల్, 25 కోడిగుడ్లు, 5 లీటర్లు పాలు, కేజీ అటుకులు, 2 కేజీల రాగిపిండి, 250 గ్రాముల బెల్లం, 250 గ్రాములు పల్లి చెక్కిలు, 250 గ్రాములు ఎండు ఖర్జూరం అందిస్తారు. నెలకు రెండుసార్లు ఈ విధంగా పంపిణీ చేస్తారు. 6 నెలల బిడ్డ నుంచి 3 ఏళ్ల బిడ్డ వరకు 25 లీటర్ల పాలు, 25 కోడిగుడ్లు, 25 కేజీల బాలామృతం ఇస్తారు.

జిల్లా పరిధిలో ఇలా..

జిల్లాలోని 29 మండలాల పరిధిలో 8 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉండగా 1620 అంగన్‌వాడీ కేంద్రాలు, 43 మినీ కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాల్లో 0-6 నెలలు లోపు 16,548 మంది చిన్నారులు, 7 నెలలు నుంచి ఏడాది లోపు 14,698 మంది, సంవత్సరం నుంచి మూడేళ్ల లోపు 50,137 మంది, 3 నుంచి 6 ఏళ్ల లోపు 39,462 మంది చిన్నారులు, 14,319 మంది గర్భిణిలు, 13,077 మంది బాలింతలు ఉన్నారు. ఆళ్లగడ్డ ప్రాజెక్టు పరిధిలో 309 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నారు.



పోషణ్ యాప్‌పై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ సుశీల

100 శాతం అందించేలా చర్యలు



అంగన్‌వాడీ కేంద్రాల్లో ముఖ గుర్తింపు ద్వార పోషకాహారం అందిస్తున్నాం. ప్రభుత్వం చేపట్టిన ఈ విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయనున్నారు. 100 శాతం లబ్ధిదారులకు పౌష్టికాహారం అందించడమే లక్ష్యం. అంగన్‌వాడీ కేంద్రాల్లో ముఖ గుర్తింపుతో పాటు ఈకేవైసీ చేయిస్తున్నాం. ఆళ్లగడ్డ ప్రాజెక్టు పరిధిలోని 306 అంగన్‌వాడీ కేంద్రాల్లో పక్కాగా ముఖ ఆధారిత గుర్తింపు ప్రక్రియను అమలు చేస్తాం.
తేజశ్వరి, సీడీపీవో, ఆళ్లగడ్డ


ఆరు ప్రాజెక్టులకు ఓకే.!

(5వ పేజీ తరువాయి)

కూటమి ప్రభుత్వం వచ్చాక పురోగతి 25 శాతం కంటే తక్కువ ఉండడంతో పనులు ఆపేశారు. తాజాగా ఈ పనులు కూడా కొనసాగించేందుకు సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గం ఆమోదం తెలపడంతో రాయలసీమ లిఫ్టుకు అడ్డంకులు తొలగిపోయినట్లే అని సీమ సాగునీటి నిపుణులు పేర్కొంటున్నారు.

మంత్రివర్గం ఆమోదించిన ఇతర ప్రాజెక్టులు

- గోరకల్లు రిజర్వాయర్ (జీబీఆర్) వద్ద 10 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో 3 వెంట్లతో అడిషనల్ ఇన్‌ఫాల్ రెగ్యులేటర్, అప్రోచ్ ఛానల్, లీడింగ్ ఛానల్ పనులకు రూ.36.95 కోట్లు మంజూరు చేస్తూ 2020 మే 5న అప్పటి ప్రభుత్వం జీవో ఆర్టీ నెంబరు.203 జారీ చేసింది. హైదరాబాద్‌కు చెందిన ఆర్‌ఆర్ ఎడిఫీసే ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.28.75 కోట్లకు పనులు చేసేందుకు 2021 డిసెంబరు 29న ఒప్పందం చేసుకుంది. అయితే.. పనులు మొదలు కాలేదు.
- శ్రీశైలం ప్రాజెక్టు 12 క్రస్ట్‌గేట్లు ప్రత్యేక మరమ్మతులు, గేట్ల రబ్బర్ సీల్స్ మార్చడం, దెబ్బతిన్న హాయిస్ట్ ప్లాట్ ఫారం చెకర్డ్ ప్లేట్స్ మార్చడం, దెబ్బతిన్న గాంట్రీ-క్రేన్ కేబుల్, క్యాబిన్స్ మార్చడం వంటి పనులకు రూ.1.59 కోట్లు మంజూరు చూస్తూ 2024 ఫిబ్రవరి 6న జీవో ఆర్టీ నంబరు.64 జారీ చేశారు. రూ.1.40 కోట్లకు పనులు చేసేందుకు కర్నూలుకు చెందిన ఎస్‌వీ ఇంజనీరింగ్ సంస్థ గతేడాది సెప్టంబరు 20న ఒప్పందం చేసుకుంది. రూ.8 లక్షలు (5.71 శాతం) పనులు మాత్రమే చేశారు.
- శ్రీశైలం డ్యాం సైట్‌లో 2,000 కేవీఏ విద్యుత్ ట్రాన్స్‌ఫారం కాలిపోయింది. దాని స్థానంలో 1,000 కేవీఏ విద్యుత్ ట్రాన్స్‌ఫారం ఏర్పాటుకు రూ.కోటి మంజూరు చేస్తూ గతేడాది ఫిబ్రవరి 2న జీవో ఆర్టీ నంబరు.63 జారీ చేశారు. రూ.88 లక్షలకే ట్రాన్స్‌ఫారం ఏర్పాటుకు హైదరాబాద్‌కు చెందిన ఆర్. పాండురంగం అండ్ సన్స్ సంస్థ ఒప్పందం చేసుకుంది. రూ.5 లక్షలు (5.68 శాతం) పనులు మాత్రమే చేశారు.
- నంద్యాలలో కేసీ కెనాల్ సముదాయంలో తెలుగుగంగ సర్కిల్, ఎస్ఆర్‌బీసీ సర్కిల్ కార్యాలయ భవనాలు నిర్మాణాలకు రూ.5.25 కోట్లు మంజూరు చేస్తూ 2020 మే 5న అప్పటి ప్రభుత్వం జీవో ఆర్టీ నంబరు.203 జారీ చేసింది. ఈ పనులు రూ.4.88 కోట్లతో చేసేందుకు నంద్యాలకు చెందిన కానాల గోపాల్ రెడ్డి అనే కాంట్రాక్టర్ ఒప్పందం చేసుకొని రూ.30 లక్షలు (6.25 శాతం) పనులు మాత్రమే చేశారు.
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో జలవనరులు శాఖ పరిధిలో ఆగిపోయిన రూ.6,581.96 కోట్ల విలువైన వేదవతి, ఆర్డీఎస్ కుడి కాలువ, రాయలసీమ లిఫ్ట్ సహా ఏడు పనులు కొనసాగించేందుకు సీఎం చంద్రబాబు అధ్యక్షత జరిగిన మంత్రివర్గం సమావేశంలో నిర్ణయం తీసుకోవడంపై రైతులు, సాగునీటి నిపుణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



శ్రీశైలం ప్రాజెక్టు

మాజీ ఎంపీ సంజీవకుమార్‌కు గోల్డ్ మెడల్

కర్నూలు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో చేసిన సేవలకు గుర్తింపుగా కర్నూలు మాజీ ఎంపీ డాక్టర్ సంజీవకుమార్‌కు గోల్డ్‌మెడల్ దక్కింది. 17వ లోక్‌సభలో 2019 నుంచి 2024 వరకు ంజీవకుమార్ ఎంపీగా ఉన్నారు. ఆ సమయంలో రెడ్ క్రాస్ సొసైటీ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారు. నాడు కృషికి గుర్తింపుగా రెడ్‌క్రాస్ సొసైటీ గోల్డ్‌మెడల్ అందజేసింది. బుధవారం విజయవాడలోని తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా ఈ సత్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా సంజీవకుమార్ మాట్లాడుతూ ఎంపీగా ఉన్న సమయంలో సేవా కార్యక్రమాలు నిర్వహించానన్నారు. అందులో భాగంగా రెడ్ క్రాస్ సొసైటీల అభివృద్ధి కోసం తన వంతు బాధ్యతగా కృషి చేశానని తెలిపారు. పదవిలో ఉన్నా లేకపోయినా సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటూనే ఉంటానని చెప్పారు.



గవర్నర్ చేతుల మీదుగా గోల్డ్‌మెడల్ అందుకుంటున్న మాజీ ఎంపీ సంజీవకుమార్

నేడు 'శ్రీ షిరిడీ సాయిలీలలు' నాటకం

కర్నూలు కల్చరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి సౌజన్యంతో, కర్నూలు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో 'శ్రీ షిరిడీ సాయిలీలలు' నాటకం ప్రదర్శిస్తున్నట్లు నంది అవార్డు గ్రహీత గుర్రపుశాల అంకయ్య తెలిపారు. గురువారం సాయంత్రం 6:30 గంటలకు ఈ నాటకం ప్రారంభమవుతుందన్నారు. విద్యాసంస్థల అధినేత డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి నాటకాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. ఈ నాటకంలో సాయిబాబాగా గుర్రపుశాల అంకయ్య, పి.షేక్షావలి, సుబ్బయ్య, వెంకటేశ్వర్లు, క్రిష్ణయ్య, రామకృష్ణ, శ్రీనివాసులు, గోవిందరాజులు, శారద, ఆర్.రాధిక నటిస్తున్నట్లు వివరించారు. మార్తాటి గోపాలరావు రాసిన ఈ నాటకానికి టీవీ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారని తెలిపారు. నాటకాభిమానులు, సాయి భక్తులు ఈ నాటకం తిలకించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్లాట్ల వివాదాన్ని పరిష్కరించిన శాశ్వత లోక్ అదాలత్



శాశ్వత లోక్ అదాలత్ సమక్షంలో రాజీ అవుతున్న బాధితులు

కర్నూలు లీగల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న ప్లాట్ల వివాదాన్ని కర్నూలు శాశ్వత లోక్ అదా లత్ సత్వరంగా పరిష్కరించినట్లు శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షుడు ఎం. వెంకట హరినాథ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదోని మండలంలో శ్రీలక్ష్మమ్మ అవ్వ ఎంటర్ ప్రైజెస్ అనే రియల్ ఎస్టేట్ సంస్థ బెనిఫిట్స్ స్కీం కింద పలువురు వ్యక్తుల నుంచి కంతులను స్వీకరించింది. డ్రిప్‌ల ద్వారా లబ్ధి పొందిన వ్యక్తులకు, కంతుల కాలం పూర్తయిన తర్వాత కూడా సంస్థ నిర్వాహకులు ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయలేదు. డ్రిప్‌ల ద్వారా వచ్చిన బహుమతులను కూడా ఇవ్వలేదు. దీంతో బాధితులంతా కలిసి తమ న్యాయవాది షేక్ షఫీ, మస్తాన్ వలీ ద్వారా లోక్ అదాలత్‌ను ఆశ్రయించారు. దీంతో శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షుడు సంస్థ నిర్వాహకులకు నోటీసులను జారీ చేశారు. దీంతో బుధవారం రూ.25,35,000 విలువగల ఈ కేసులను ఎటువంటి ఖర్చు లేకుండా పరిష్కరించి బాధితులకు న్యాయం చేసినట్లు శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షులు ఎం. వెంకట హరినాథ్ తెలిపారు.

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

- వినూత్న నిరసనలతో కార్మికుల సమ్మె

ఎమ్మిగనూరుటౌన్/రూరల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): కార్మికులకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణ మే రద్దు చేయాలని ఆయా కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో ఆయా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన దేశవ్యాప్త సమ్మె విజయవంతమైంది. ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, ఆశా, అంగన్‌వాడీ, ఏఐకేఎస్, విద్యుత్, ఆటో కార్మిక తదితర కార్మిక సంఘాల నాయకులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో వినూత్న రీతిలో నిరసన చేపట్టి అందరిని ఆలోచింపజేశారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ కార్మికులకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలన్నారు. కనీస వేతనం రూ.26వేలు అమలు చేసి, పనిప్రదేశాల్లో కార్మికులకు రక్షణ కల్పించాలని, భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, 8గంటల పనిదినాలను కల్పించాలన్నారు. మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాలను నీరుగార్చిందని, సులభతర వాణిజ్యం నెపంతో కార్మికులకు వ్యతిరేకంగా ఆదాని, అంబానీ లాంటి కార్పొరేట్ కార్మికులకు అనుకూలంగా బ్రిటీషు కాలంనాటి చట్టాలను సైతం మార్పులకు చర్యలు తీసుకుంటారని విమర్శించారు.





సమస్యల పరిష్కారం కోసం వినూత్న నిరసన చేపట్టిన కార్మికులు

డీసీసీలో అధ్యక్ష గోల..!

(5వ పేజీ తరువాయి)

దశాబ్దాలుగా పార్టీని నమ్ముకున్న క్యాడర్ జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో నేటికీ చెక్కుచెదరలేదు. నడిపించే సారధిలేక పోవడంతో దిగువ స్థాయి నాయకులు, కార్యకర్తలు పార్టీని నమ్ముకుని జిల్లా కార్యాలయం చుట్టు నేటికి తిరుగుతూనే ఉన్నారు. గత నెలలో పీసీసీ అధ్యక్షురాలు వైస్ షర్మిల జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ పరిస్థితిపై సమీక్షించిన సమయంలో ఒక్కసారిగా పార్టీలోని వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. పార్టీకి విధేయులుగా ఉన్నవారినే డీసీసీ అధ్యక్షుడిగా ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీకి జిల్లా అధ్యక్ష స్థానంలో మాజీ గవర్నర్ పెండెకంటి వెంకట సుబ్బయ్య, బీజీ ఎల్లయ్య, మద్దూరు సుబ్బారెడ్డి లాంటి ఎందరో ఉద్దండులు వన్నె తెచ్చారు. అటువంటి పార్టీకి నేడు సరైన నాయకుడు లేక వెలవెలబోతోంది. ఈ క్రమంలో ఏఐసీసీ సభ్యుడు, నంద్యాల డీసీసీ అధ్యక్షుడు జంగిటి లక్ష్మీ నరసింహ యాదవ్‌ను జిల్లా ఇన్‌చార్జిగా నియమిస్తూ అధిష్ఠానం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో జిల్లాకు సరైన డీసీసీ కమిటీ ఏర్పాటుపై కార్యకర్తలు యాదవ్‌పైనే ఆశలు పెట్టుకున్నారు.

కోటరీల తీరుతో బేజారు..?

కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం కోటరీలతో తలపట్టుకుంటోంది. కోటరీలు, వర్గాలుగా విడిపోయి కుమ్ములాటలకు వేదికగా మారింది. ఓ మాజీ డీసీసీకి విధేయుడుగా ఉంటూ జిల్లా ప్రధాన కార్యదర్శి పోస్టులో పార్టీని గాడిలో పెట్టేందుకు తన వంతు ప్రయత్నాలు చేశారు. ఆయన వ్యవహారం కొందరికి తల నొప్పిగా మారడంతో ఆయన్ను కొన్ని కోటరీలు పార్టీనుంచే బహిష్కరించేలా చక్రం తిప్పాయి. ఆయన కూడా ప్రస్తుతం డీసీసీ సీటు కావాలంటూ మాజీ మంత్రి మారెప్పద్వారా ప్రకటనలు ఇప్పిస్తుండగా, మరి కొందరు తమ పేరు కూడా రాయలేని వారు, రాజకీయ ఓనమాలు తెలి యని వారు సైతం డీసీసీ పీఠం కోసం పైరవీలు చేస్తున్నారు. మాజీ డీసీసీలు కొందరు ప్రయత్నాల్లో ఉండగా మరి కొందరు వారి పక్కనే ఉంటూ వారికి తెలియకుండా డీసీసీ పీఠం తమకే దక్కాలంటూ తెరచాటు ప్రయత్నాలు చేస్తున్నారు.

పార్టీని బలోపేతం చేస్తాం



పార్టీని నియోజవర్గాల వారీగా బలోపేతం చేస్తాం. అధిష్ఠానం నాపై ఉంచిన నమ్మకాన్ని నిలుపుకుంటా. జిల్లాకు బలమైన డీసీసీని ఏర్పాటు చేయాల్సి ఉంది. పార్టీని నమ్ముకుని దశాబ్దాల కాలం నాటి నుంచి పనిచేస్తున్న కార్యకర్తలు, నాయకులకు ప్రాధాన్యం ఇస్తాం. పటిష్ట ప్రణాళికతో పార్టీని బ్రతికించుకు నేందుకు ప్రతి ఒక్కరిని ఐక్యంగా ఉండి పని చేసే విధంగా బలోపేతం చేయాల్సిన బాధ్యత నాపై ఉంది. త్వరలోనే నియోజ కవర్గాల సమీక్ష చేపట్టి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తాం.
- జంగిటి లక్ష్మీ నరసింహ యాదవ్, ఏఐసీసీ సభ్యులు, జిల్లా ఇన్‌చార్జి

పెద్ద పండుగ

(5వ పేజీ తరువాయి)

- పీటీఎం నిర్వహణకు పాఠశాల కాంపోజిట్ గ్రాంట్

సమావేశానికి కావాల్సిన వస్తువులు, పరికరాలు, ఇతర అవసరాల కోసం పాఠశాలకు కేటాయించిన స్కూల్ కాంపోజిట్ గ్రాంట్‌నుంచి విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఖర్చు చేయాలని ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఖర్చులు, కొనుగోళ్లు, ఇతర వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని, దాతల సహకారం కూడా కోరవచ్చని జీవోలో పేర్కొన్నారు.

పాటించాల్సినవి

పాఠశాలలను మామిడి తోరణాలు, అరటి బోదెలు, రంగుల కాగితాలను ఉపయోగించి అందంగా అలంకరించాలి. పాఠశాల ఆహ్లాదకరంగా పచ్చదనంగా ఉండేలా మొక్కలు నాటాలని ప్రతి విద్యార్థి వారి తల్లిదండ్రులతో కలిసి కనీసం ఒక్క మొక్క అయినా నాటేలా ప్రోత్సహించాలని ప్రభుత్వం ఇప్పటికే పిలుపునిచ్చింది. తల్లుల కోసం ముగ్గుల పోటీలు, మ్యూజికల్ ఛైర్స్, లెమన్ అండ్ స్పూన్, తండ్రులకు టగ్ ఆఫ్ వార్ పోటీల నిర్వహణ. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులను కలిపి అభిప్రాయ సేకరణ జరుగుతుంది. అదేవిధంగా మధ్యాహ్నం డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులతో అందరూ కలిసి సహపంక్తి భోజనం చేయాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.



గతంలో కంటే భిన్నంగా నిర్వహిస్తాం



మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌ను గతంలో కంటే భిన్నంగా ఆదర్శవంతంగా నిర్వహిస్తాం. విద్యార్థులను వారి తల్లిదండ్రులను, స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించి పండుగలా నిర్వహిస్తాం. బనగానపల్లె ప్రభుత్వ బాలికల పాఠశాలలో మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి, నంద్యాల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్‌లు పాల్గొంటున్నారు.
- జనార్ధన్‌రెడ్డి, డీఈవో, నంద్యాల

స్కూల్ కాంపోజిట్ నిధుల నుంచి ఖర్చు



మెగా పీటీఎంను గ్రాండ్‌గా నిర్వహించేందుకు దాతలతో పాటు స్కూల్ కాంపోజిట్ నిధుల నుంచి ఖర్చు చేసేవిధంగా ప్రధానోపాధ్యాయులను ఆదేశించడం జరిగింది. ఎక్కడా ఏ మాత్రం రాజీపడకుండా ఈవెంట్‌ను నిర్వహించాలని సూచించాము. అన్ని పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య సత్సంబంధాలు ఉండే విధంగా కార్యక్రమాన్ని ప్రభుత్వం రూపొందించింది. తల్లిదండ్రులు తప్పకుండా పాల్గొనాలని కోరుతున్నాము. - ప్రేమంత్‌కుమార్, ఏపీసీ సర్వశిక్షా అభియాన్, నంద్యాల జిల్లా

అద్భుతంగా మెగా పీటీఎం ఏర్పాట్లు



కర్నూలు జిల్లాలో మెగా పీటీఎం కార్యక్రమాల ఏర్పాట్లు అద్భుతంగా ఉన్నాయి. కలెక్టర్ ఆధ్వర్యంలో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు చర్యలు తీసుకుంటున్నాము. ఇలాంటి సమావేశాల ద్వారా ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య సంబంధాలు బలపడి పాఠశాలల అభివృద్ధికి దోహదపడుతాయి. గురువారం కర్నూలు ప్రభుత్వ టౌన్ మోడల్ పాఠశాలలో జరిగే ఈ కార్యక్రమానికి రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, కలెక్టర్ రంజిత్ బాషా, కేవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపి బస్తిపాటి నాగరాజు, బీ.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల, పాఠశాలలో కార్యక్రమాల్లో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, జాయింట్ కలెక్టర్లు హాజరవుతారు.
- శామ్యూల్ పాల్, డీఈఓ, కర్నూలు

విజయవంతం చేయండి: కలెక్టర్

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా గురువారం జరిగే మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరినీ భాగస్వామ్యులను చేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో నిర్వహించే సమావేశాల్లో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ఖచ్చితంగా భాగస్వాములను చేయాలని ఆదేశించారు. గత సంవత్సరంలో సాధించిన ఫలితాలు, నివేదికలతో, తల్లికి వందనం పథకం తదితర అంశాలపై చర్చించాలని అన్నారు. పాఠశాలల్లో చేపడుతున్న క్రీడలు, పాఠశాల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను తల్లిదండ్రులకు వివరించాలని, ఆటల పాటలు కూడా నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

బకాయిలపై ప్రత్యేక దృష్టి

• వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ నీరజ



కర్నూలు న్యూసిటీ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో రెవెన్యూ, పాత బకాయిల వసూలుపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ జే. నీరజ తెలిపారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆమె బుధవారం గుత్తి పెట్రోలు బంకు సమీపం లోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలోని ఇతర జిల్లాల కంటే కర్నూలు జిల్లా జీఎస్టీ వసూళ్లు అత్యధికంగా ఉన్నాయన్నారు. గత సంవత్సరం ఏప్రిల్‌లో రూ.89.404 కోట్ల జీఎస్టీ రాగా, ఈ సంవత్సరం 12 శాతం ఎక్కువగా ఏప్రిల్‌లో రూ.99.55 కోట్ల జీఎస్టీ వసూలైందన్నారు. జిల్లాలో గ్రీన్ ఎనర్జీ, సోలార్ ఎనర్జీ, మైనింగ్, సిమెంట్, ఐరన్ ఓర్ తదితర కార్యకలాపాల వల్లనే ఇది సాధ్యమైందన్నారు. సంవత్సరానికి రూ.1,120 కోట్లు వసూలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారన్నారు. అంతే కాకుండ పాతబకాయిలు(ఏపీజీఎస్టీ, ఏపీ వ్యాట్, జీఎస్టీ) ఇప్పటి వరకు రూ.150 కోట్లు ఉండగా అందులో కేవలం ఆదోని సర్కిల్ పరిధిలో రూ.90 కోట్లు, నంద్యాల సర్కిల్ పరిధిలో రూ.40 కోట్లు, కర్నూలు సర్కిల్ పరిధిలో రూ.10 కోట్లు ఉన్నాయన్నారు. బకాయిలు చెల్లించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మద్దికెర, జూలై 9 (ఆంధ్రజ్యోతి): గ్రామ శివారులో బైక్, టీవీఎస్ వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. బంధువులు, ఎస్ఐ కథనం మేరకు.. పత్తికొండ మండలం కైరుప్పల చెన్నంపల్లి గ్రామానికి పెద్ద తిరుపతిరావు(23) భార్య, కుమాడిని చూసేందుకు గుంతకల్లు మండలం గూలిపాల్యం గ్రామానాకి నెల 8వ తేదీన వెళ్లాడు. తిఇరిగి బుధవారం మధ్యాహ్నం స్వగ్రామానికి బైక్‌పై వస్తుండగా మద్దికెర శివారులో ఎదురుగా వస్తున్న టీవీఎస్ 50 వాహనం ఢీకొట్టి, కల్వర్టు పక్కన ఎగిరిపడటంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య రాశి, మూడు నెలల కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ విజయకుమార్ నాయక్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమ్మితం మార్చురికి తరలించారు.



తిరుపతిరావు (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్..

ఓర్వకల్లు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి-40పై నన్నూరు గ్రామ సమీపాన గల విద్యుత్ సబ్ స్టేషన్ ఎదురుగా బుధవారం తెల్లవారుజామున బొలేరో పికప్ వాహనం యూటర్న్ డీవైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం నందికుంట గ్రామానికి చెందిన డ్రైవర్ గజ్జలకొండ వేణు (45) అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ వాహనాన్ని కడప నుంచి హైదరాబాదుకు తీసుకెళ్తుండగా.. ఈ ప్రమాదం జరిగింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

• భార్య ఎడబాటుతో పెట్రోలు పోసుకుని..

నందికొట్కూరు రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): భార్య గొడవపడి పుట్టింటికి వెళ్లి తిరిగి రాకపోవడంతో ఎడబాటుకు గురైన భర్త ఒంటిపై పెట్రోలు పోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నందికొట్కూరు మండలంలోని శాతనకోట గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన చిన్న మహ్మద్ కుమారుడు షేక్ ఇస్మాయిల్(29) భార్య ఫయజున్ బీ గొడవపడి వెంకటాపురంలోని పుట్టింటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఇస్మాయిల్ మనస్తాపానికి గురయి యింట్లో ఎవరూ లేని సమయంలో ఒంటిపై పెట్రోలు పోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చుట్టుపక్కల వారు చూసి మంటలను ఆర్పి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చనిపోయాడు. ఈ దంపతులకు ఇద్దరు కుమారులు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు బ్రాహ్మణకొట్కూరు ఇన్‌చార్జ్ ఎస్సై ఓబులేసు తెలిపారు.



షేక్ యిస్మాయిల్ (ఫైల్)

తల్లీ కొడుకుల ఆత్మహత్యాయత్నం..

• తల్లి మృతి.. కొడుకు పరిస్థితి విషమం

మంత్రాలయం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలకలడోన గ్రామానికి చెందిన బోయలక్ష్మి(31), ఆమె కుమారుడు అమోఘవర్ధన్(11) క్రిమిసం హారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటన బుధవారం జరిగింది. చిలకలడోన గ్రామానికి చెందిన లక్ష్మి, విజ యుడు దంపతులకు అమోఘవర్ధన్, శ్రీలేఖ సంతానం. విజయుడు బావమరుదలు అతని వద్ద అప్పు తీసుకొని తిరిగి ఇవ్వలేదు. ఈ విషయంపై భార్యతో అంతా నీ వల్లే జరిగిందని కోపంగా మాట్లాడాడు. దీనికి తోడు 2020లో లక్ష్మి రోడ్డు ప్రమాదంలో గాయపడి కొద్ది మతిస్థిమితం కోల్పోయింది. భర్త మాటలకు మనస్తాపానికి గురైన లక్ష్మి మంగళవారం రాత్రి ఇంట్లో ఉన్న పురుగుల మందును మ్యాంగో జ్యూస్‌లో కలుపుకుని తాగి, కొడుకుకు కూడా ఇచ్చింది. వీరిని ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లక్ష్మి కోలుకోలేక మృతి చెందింది. కొడుకు పరిస్థితి విషమంగా ఉంది. అతడిని కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతురాలి అన్న కామనదొడ్డి గోపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మంత్రాలయం ఎస్ఐ శివాంజల్ తెలిపారు.



బోయ లక్ష్మి (ఫైల్)

మిస్సింగ్ కేసును ఛేదించిన పోలీసులు



మరియమ్మతో పోలీసులు

ఆత్మకూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశంతో ఆత్మకూరు పోలీసులు మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటికే ఈ వారంలో రెండు మిస్సింగ్ కేసులను ఛేదించగా బుధవారం మరో ఒక కేసును పరిష్కరించారు. ఆత్మకూరు మండలంలోని నల్లకాల్వ గ్రామానికి చెందిన మరియమ్మతో అదే మండలంలోని శ్రీపతిరావుపేటకు చెందిన ఏసన్నకు వివాహమైంది. రెండేళ్ల తర్వాత వారి మధ్య మనస్పర్థలు రావడంతో 2022లో ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయింది. అప్పట్లో ఆమె భర్త ఏసన్న ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా మరియమ్మ హైదరాబాద్‌లో ఉన్నట్లు గుర్తించినట్లు ఆత్మకూరు అర్బన్ సీఐ రాము తెలిపారు. పోలీసులు ఆమెను వారి కుటుంబసభ్యులకు అప్పగించారు

స్థల వివాదంలో ఘర్షణ..

• యువకుడికి గాయాలు

మంత్రాలయం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలపల్లి గ్రామానికి చెందిన మదార్‌బీ, ఆమె కొడుకు అమీర్‌లపై అదే గ్రామానికి చెందిన వీరేష్, అతని భార్య, కొడుకులు దాడి చేశారు. ఈ ఘటనలో అమీర్ తలకు గాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం జరిగింది. ఇంటి స్థలం విషయంపై మదార్‌బీ, వీరేష్ మధ్య విభేదాలు ఉన్నాయి. వారి మధ్య మాటామాటా పెరిగి బల్లక వీరేష్, అతని భార్య కుమారులు కర్రతో అమీర్ తలపై మోదారు. దీంతో ఆయనకు రక్తగాయాలయ్యాయి. అమీర్‌ను ఆసుపత్రికి తరలించారు. మదార్‌బీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వీరేష్ కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మాధవరం హెడ్ కానిస్టేబుల్ విజయ్ తెలిపారు.

సంక్షేమం ఎరుగని మత్స్య కార్మికులు

• గత వైసీపీ పాలనలో పథకాలన్నీ కనుమరుగు..
• నేడు ఒక్కో పథకం అమలులోకి..
• నేడు జాతీయ మత్స్యకారుల దినోత్సవం



పాచిపట్టి నిరుపయోగంగా మారిన చేపల తొట్లు



శిథిలావస్థలో జిల్లా మత్స్యశాఖ కార్యాలయం

కర్నూలు అగ్రికల్చర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం ఇచ్చే శాఖల్లో మత్స్యశాఖ ఒకటి. గత వైసీపీ పాలనలో మత్స్యకారుల సంక్షేమ పథకాలను పూర్తిగా రద్దయ్యాయి. ఉమ్మడి జిల్లాలో దాదాపు లక్ష మంది మత్స్యకారులు ఉన్నారు. నేడు జాతీయ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా కూటమి ప్రభుత్వం తమను ఆదుకోవాలని జాతీయ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా కార్మికులు కోరుతున్నారు.

కర్నూలు జిల్లాలో మత్స్యశాఖ అధీనంలో 178 చెరువులు, 8 రిజర్వాయర్లు వున్నాయి. సుంకేసుల, గాజులదిన్నె, కర్నూలు, మంత్రాలయంలో చేపపిల్లల ఉత్పత్తి కేంద్రాలను నిర్వహిస్తున్నారు. కర్నూలులో 1956లో ఏర్పాటు చేసిన చేపపిల్లల ఉత్పత్తి కేంద్రానికి ఎంతో చరిత్ర ఉంది. ఈ కేంద్రం రాయలసీమలోనే చేపపిల్లల పెంపకం కోసం చేపట్టిన మొదటి కేంద్రం అని అధికారులు తెలిపారు. జిల్లాలో దాదాపు లక్ష మంది చేపల పెంపకం విక్రయాల ద్వారా ఉపాధి పొందుతున్నారు. చేపపిల్లల పెంపకం ద్వారా వస్తున్న ఆదాయంలో 50 శాతం నీటి సంఘాలకు, 30 గ్రామ పంచాయతీలకు, 20 శాతం డిపార్టుమెంటుకు ఇచ్చేలా గత వైసీపీ ప్రభుత్వం తెచ్చిన జీవో మత్స్యకారుల జీవనోపాధికి గొడ్డలివేటులా మారింది. ఈ జీవోను కూటమి ప్రభుత్వం రద్దు చేసి, ఒక్కో పథకాన్ని పునరుద్ధరించడంతో మత్స్యకారుల జీవితాల్లో వెలుగు వచ్చినట్లయిందని ఉమ్మడి జిల్లాల మత్స్యకారుల సహకార యూనియన్ చైర్మన్ నవీన్ కుమార్ తెలిపారు.

మత్స్యకార్మికుల జీవితాల్లో వెలుగులు నింపుతాం



గత వైసీపీ పాలనలో మత్స్యకారులు జీవనోపాధి కోల్పోయి రోడ్డున పడ్డారు. ఆ పరిస్థితి నుంచి వారిని గట్టెక్కించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గ్రామాల్లో మత్స్యకార సంఘాలను బలోపేతం చేస్తున్నాం. అర్హత ఉన్న మత్స్యకారుల ందరికీ ఈ సంఘాల్లో సభ్యత్వం కల్పించేందుకు చర్యలు చేపట్టాము. **- నవీన్ కుమార్, ఉమ్మడి జిల్లా మత్స్యకారుల యూనియన్ చైర్మన్ నవీన్ కుమార్**

ఘనంగా మత్స్యకారుల దినోత్సవం



మత్స్యకారుల జాతీయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నాం. తుంగభద్ర నదితీర సమీపంలో చేపల పెంపకం ఎక్కువగా జరుగుతోంది. ఇందులో భాగంగా కోసిగిలో దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం.

- రంగనాథరావు, డిప్యూటీ డైరెక్టర్

రాయలసీమలో మత్స్యకారుల శిక్షణ కేంద్రం

రాయలసీమలోని 4 జిల్లాల్లో చేపల పెంపకంతో పాటు వాటి వేటకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సాంకేతిక పద్ధతులను నేర్పించేందుకు కర్నూలులోని బంగారుపేటలో 1977లో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మూడు నెలల పాటు ఇక్కడ శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటిదాకా 123 బ్యాచ్‌లలో 2,559 మందికి శిక్షణ ఇచ్చారు.

నకిలీ వ్యక్తులతో రిజిస్ట్రేషన్

• మృతుల పేరుతో అక్రమం
• చేతులు మారిన రూ.18లక్షలు
• ఐదుగురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఎం.తబ్రేజ్

కోడుమూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): చనిపోయిన వ్యక్తుల పేరుతో 5 సెంట్ల స్థలాన్ని నకిలీ వ్యక్తులు మరొకరికి రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. ఈ కథ బెడిసికొట్టి చివరకు పోలీసులకు చిక్కి కటకటాలపాలు అయ్యారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో బుధవారం విలేకర్ల సమావేశంలో సీఐ ఎం.తబ్రేజ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కర్నూలు పట్టణానికి చెందిన అన్నదమ్ములు కాకే నారాయణ, కాకే నాగరాజు 1984లో కోడుమూరు సమీపంలోని 100 సర్వే నంబర్‌లో ఐదు సెంట్ల స్థలాన్ని కొన్నారు. అనారోగ్యంతో 2013లో నారాయణ, 2014లో నాగరాజు మృతి చెందారు. గూడూరు మండలం చనుగొండ్ల గ్రామానికి చెందిన సోమేష్, కోడుమూరు పట్టణానికి చెందిన బోయ మధు, కోడుమూరు మండలం వర్కూరు గ్రామానికి చెందిన రాజోలి గిడ్డయ్య కలిసి చనిపోయిన అన్నదమ్ముల పేర్లు ఉన్న వ్యక్తుల పట్టుకొని వారి ఐదు సెంట్ల స్థలాన్ని కాజేయాలని ప్రథకం వేశారు. గోనెగండ్ల మండలం పెద్దనెలటూరు గ్రామానికి చెందిన బోయ నారాయణ, నాగరాజు అనే వ్యక్తులను వెతికి పట్టుకున్నారు. ఆ తర్వాత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోని అధికారులతో కుమ్మక్కై ఐదు సెంట్ల స్థలాన్ని 2023లో ఆ నకిలీ వ్యక్తులతో రిజిస్టర్ చేయించారు. ఐదు సెంట్ల ప్లాట్‌ను అమ్మగా వచ్చిన రూ.18లక్షలను అందరూ సమానంగా పంచుకొన్నారు. చనిపోయిన కాకే నారాయణ భార్య లీలావతి భర్త కొనుగోలు చేసిన స్థలాన్ని చూసేందుకు ఇటీవల కోడుమూరుకు వచ్చింది. ఆ సందర్భంగా అసలు విషయం బైటపడింది.

లీలావతి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ డివై.స్వామి విచారణ చేపట్టి బుధవారం సోమేష్, మధు, రాజోలి గిడ్డయ్య, బోయ నారాయణతో పాటు ఇందుకు సహకరించిన మాదాసు నాగేష్‌ను అరెస్టు చేశారు. నిందితులు నాగరాజు, విష్ణు పరారిలో ఉన్నారు. ఈ కేసులో మరి కొంత మందిని విచారించాల్సి ఉందని సీఐ చెప్పారు.

బాలాపురంలో చోరీ

• రూ. 1.10 లక్షలు, బంగారు, వెండి వస్తువులు, ప్రామిసరీ నోట్ల అపహరణ



దొంగలు ధ్వంసం చేసిన బీరువా

వెల్దుర్తి, జూలై 9(ఆంధ్రజ్యోతి): మండలం బాలాపురం గ్రామంలో భారీ చోరీ జరిగింది. కృష్ణమోహన్‌రెడ్డి, మల్లమ్మ దంపతులు మంగళవారం రాత్రి వర్షం కురుస్తుండడంతో పాత ఇంటిలో నిద్రించడం అంత సురక్షింతం కాదని, దగ్గర్లో ఉన్న కుమారుడు మధుసూదన్‌రెడ్డి ఇంటికి వెళ్లి నిద్రించారు.బుధవారం తెల్లవారు జామున వచ్చి చూడగా ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంటిలోకి వెళ్లగా బీరువా తలుపులు తెరచి వస్తువులు చిందరవందరగా పడిఉన్నాయి. బీరువాలో రూ.1.10 లక్షల నగదు, 3 తులాల బంగారు, 20 తులాల వెండి వస్తువులు, రూ.10లక్షల విలువైన ప్రామిసరి నోట్లు గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. బాధితుడు వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని ఫిర్యాదు చేశాడు. చోరీ జరిగిన ప్రాంతాన్ని పోలీసులు పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

దుకాణానికి నిప్పు.

• బీజేపీ, వైసీపీ కార్యకర్తలపై కేసు నమోదు

ఆదోని రూరల్, జూలై 9 ఆంధ్రజ్యోతి): మండలంలోని దొడ్డనగేరి గ్రామంలోని ఓ దుకాణానికి నిప్పు పెట్టడంతో దగ్ధమూ రూ.లక్ష ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితుడు ఈడిగ శంకర్ వాపోయాడు. బాధితుడి కథనం మేరకు.. స్థానిక ఆర్ అండ్ బీ స్థలంలో దుకాణం పెట్టుకున్నాడు. అయితే గ్రామానికి చెందిన బీజేపీ, వైసీపీ కార్యకర్తలు శ్రీరాములు, దాసప్ప, గర్జప్ప, జయరాం, నాగరాజు, సూరి మంగళవారం అర్ధరాత్రి దాటాక పెట్రోలు పోసి నిప్పంటించారు. మూడురోజుల క్రితం ఎమ్మెల్యే పార్థసారధి పేరు చెప్పి భయభ్రాంతులకు గురి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆరుగురుపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్ద తుంబళం ఎస్ఐ మహేష్ కుమార్ తెలిపారు.



కాలిబూడిదైన దుకాణం

ప్రజాప్రతినిధికి అంగన్‌వాడీ పోస్టు!

• వైసీపీకి సహకరించిన టీడీపీ
• ఓ నాయకురాలి లోపాయికారి ఒప్పందం?



Kurnool Local Authorities Constituency Photo Identity Card

Name of the Elector	: SHYAMALAMMA
MPTC	: MPTC AREKAL
Local Authority	: MPP, Adoni
Elector part No.	: 01
Serial No	: 24
Part Name	: RDO office, Adoni
EPIC No.	: RTM0736637
Adhaar Number	: 565391288425

Signature of the MPTC

Mandal Parishad Dev. Officer
Mandal Praja Parishad, Adoni.
Kurnool District.

ఎంపీటీసీ సభ్యురాలు శ్యామలమ్మ గుర్తింపు కార్డు

ఆదోని రూరల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం అంతా ఒక వైపు.. ఆదోని మాత్రం మరో వైపు అన్నట్టు ఉన్నాయి ఇక్కడి రాజకీయ పరిస్థితులు. ప్రతిపక్షంలో ఉండగా పోరాడిన టీడీపీ శ్రేణులను కాదని ఆదోని నియోజకవర్గంలో వైసీపీ నుంచి వచ్చి వారికి, ఇంకా ఆ పార్టీలో ఉన్న వారికే అగ్రతాంబూలం ఇస్తున్నారు ఇక్కడి నేతలు. కూటమి జెండాలు మోసిన కార్యకర్తలను కాదని ప్రత్యర్థి పార్టీకి చెందిన వారికి ప్రతిఫలం చేకూర్చేలా ఇక్కడి రాజకీయం మారింది. తాజాగా వైసీపీ మద్దతు గెలిచిన ఓ ఎంపీటీసీ సభ్యురాలికి అంగన్‌వాడీ పోస్టును ఇచ్చేశారు. ఈ పోస్టు కేటాయింపులో తెలుగుదేశం పార్టీకి చెందిన ఓ మహిళా నాయకురాలు లోపాయికారిగా ఒప్పందం కుదుర్చుకుని పోస్టు రావడంలో సహకరించినట్లు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ప్రజాప్రతినిధిగా ఉన్న వారు ప్రభుత్వ పోస్టుల్లో కొనసాగడానికి అనర్హులు. కానీ ఆదోని మండలం ఆరేకల్లు గ్రామానికి చెందిన శ్యామలమ్మ (వివాహం తర్వాత పేరుమార్పు)... వైసీపీలో క్రియాశీలకంగా ఉన్నారు. 2021 సెప్టెంబరు 24న వైసీపీ మద్దతుతో ఎంపీటీసీగా గెలిచారు. కానీ టీడీపీ ప్రభుత్వం మారిన తర్వాత తాజాగా ఆమెకు అంగన్‌వాడీ-2 కేంద్రంలో సహాయకురాలిగా పోస్టు వచ్చింది. అయితే ప్రజాప్రతినిధిగా ఆమె శ్యామలమ్మగా ఉండగా... అంగన్‌వాడీ పోస్టుకు వచ్చేసరికి ఆమె పేరు ఈరమ్మగా మారింది. విద్యార్హత పత్రాల్లోనూ ఆమె పేరు ఈరమ్మగానే ఉండటం విశేషం. అంగన్‌వాడీ పోస్టుకు దరఖాస్తు చేసుకునే సమయానికి ఆమె తన పదవికి రాజీనామా చేయలేదు. అయినప్పటికీ అధికారులు ఆమెకు పోస్టును ఎలా కేటాయించారో వారికే తెలియాలి. అయితే రెండు పేర్లు ఉండటం ఆమెకు కలిసివచ్చింది. ఈ విషయంపై ఆదోని ఎంపీడీఓ జనార్ధన్‌ను వివరణ కోరగా... ఆరేకల్లు ఎంపీటీసీగా కొనసాగుతున్న శ్యామలమ్మ పదవికి రాజీనామా చేయలేదన్నారు.

ఎంపీటీసీ అని తెలియదు

ఆరేకల్లు అంగన్‌వాడీ సెంటర్-2లో సహాయకురాలిగా ఈరమ్మకు గత నెలలో ఉద్యోగం వచ్చింది. సర్టిఫికెట్ల ఆధారంగా ఆమె పేరు ఈరమ్మ. ఆమె ఎంపీటీసీ అన్న విషయం తెలియదు. ఆమె శ్యామలమ్మ పేరుతో ప్రజాప్రతినిధిగా కొనసాగుతున్నారన్నది తెలియదు. ప్రజాప్రతినిధిగా ఉంటూ ప్రభుత్వ ఉద్యోగం చేయడానికి వీలులేదు. విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం.

- ఉమామహేశ్వరి, సీడీపీఓ, ఆదోని

వివాదాస్పదంగా మొహర్రం

• రాంపల్లెలో పోలీసులచే పీర్ల ఊరేగింపు



పోలీసుల బందోబస్తు మధ్య ఊరేగింపు

చాగలమర్రి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపల్లె గ్రామంలో మొహర్రం సందర్భంగా ఇరు వర్గాల మధ్య వివాదం నెలకొంది. ఇరువర్గాల మధ్య పట్టింపుతో పీర్ల ఊరేగింపు ఉద్రిక్తంగా మారింది. ఈ వివాదం ఎస్పీ వరకు వెళ్లింది. రెండేళ్ల నుంచి పట్టింపులతో మొహర్రం కేవలం గ్రామ చావిడికే పరిమితమైంది. ఈ ఏడాది ఎలాగైనా పీర్లను ఊరేగించాలని అధికార పార్టీ వర్గీయులు పట్టుబడటంతో మరో వర్గం వారు తాము పీర్లను తిప్పాలని పట్టుబట్టారు. పోలీసులే పీర్లను ఊరేగించాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. దీంతో మంగళవారం అర్ధరాత్రి క్యూఆర్టీ పోలీసులు పీర్లను ఎత్తుకొని జనసందోహం, దివిటీల నడుమ ఊరేగించారు.ఆళ్లగడ్డ రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి, కోవెలకుంట్ల, కొలిమిగుండ్ల, ఆళ్లగడ్డ పట్టణ సీఐలతో పాటు చాగలమర్రి ఎస్ఐ సురేష్, మరో ఇద్దరు ఎస్ఐలు, మరో 20 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఏపీ బీఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్ వెంకటరామరాజు



ఎన్ వెంకటరామరాజుతో ఏపీబీఎస్ఎస్ కమిటీ సభ్యులు

కర్నూలు కల్చరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య (ఏపీబీఎస్ఎస్) ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా ఎన్ వెంకటరామరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం పాత నగరంలోని శంకర మఠంలో ఏపీబీఎస్ఎస్ రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శి మంకాల కృష్ణకాంత్ శర్మ ఆధ్వర్యంలో సమాఖ్య కార్యవర్గ సమావేశం జరిగింది.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

ఆదోని అగ్రికల్చర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కల్లుబావి ప్రాంతంలోని ప్రకాష్‌నగర్‌కు చెందిన ఇంటర్ విద్యార్థి బుధవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రెండవ పట్టణ పోలీసులు తెలిపిన మేరకు.. ప్రకాష్‌నగర్‌కు చెందిన బజారి కుమారుడు లాజర్ పట్టణంలోని ఓ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. రాత్రి ఇంట్లో ఉరేసుకున్నట్లు సమాచారం వచ్చింది. అయితే ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి



తహసీల్దార్ కార్యాలయ అధికారులకు వినతిపత్రాన్ని అందజేస్తున్న వైద్య సిబ్బంది

ఆత్మకూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయడంతో పాటు యాప్‌ల పనిభారాన్ని తగ్గించి, పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని సీఐటీయు జిల్లా అధ్యక్షులు ఏసురత్నం, యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి రత్నమ్మ పేర్కొన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు శ్యామల, సుబ్బలక్ష్మి, మహేశ్వరి, కల్పలత, వసుంధర, లక్ష్మీదేవి, మల్లేశ్వరి, వరలక్ష్మి, ఉషారాణి, బేలేశ్వరీబాయి, బయమ్మ తదితరులు ఉన్నారు.

గ్రామ పంచాయతీల పురోగతిపై శిక్షణ

కొత్తపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల పురోగతిపై కొత్తపల్లి ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం బుధవారం జరిగింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండలంలోని గ్రామ పంచాయతీలు ఎలా పురోగతి సాధించాయనే వాటిపై మండలంలోని ఆయా శాఖల అధికారులు, సిబ్బందికి ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో మేరీ, వైద్యాధికారులు దీపా నాగవేణి, జుబేర్, పీఆర్ఏఈ మద్దిలేటి, ఎంఈవో-2 ఇనయతుల్లా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ, పంచాయతీ సెక్రటరీలు, డిజిటల్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

పాములపాడు : పాములపాడులోని ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీ పురోగతిపై సచివాలయ సిబ్బంది, మండల అధికారులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కోసం తీసుకోవాల్సిన నిర్ణయాలపై జాబితా తయారు చేయాలని సూచించారు.

భూ సమస్యలు పరిష్కరించాలి: ఎంపీపీ

గోస్పాడు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో చాలామంది రైతులు భూ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని త్వరగా పరిష్కారం చూపాలని ఎంపీపీ ఆర్థర్ సైమన్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో అమానుల్లా ఆధ్వర్యంలో సర్వసభ్యసమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ భూ సమస్యలతో పాటు రైతులకు సకాలంలో ఎరువులు అందేలాగా చూడాలని, కౌలు రైతు కార్డులు త్వరగా పంపిణీ చేయాలని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ షేక్‌మొహిద్దీన్, మండల ఉపాధ్యక్షుడు రాజు, జనార్దన్‌రెడ్డి, ఈవోఆర్డీ నాగ అనసూయ, ఏపీవో గంగన్న, ఏవో స్వప్నిక, పీఆర్ ఏఈ పుల్లయ్య, యాళ్లూరు సీహెచ్‌సీ డాక్టర్ ప్రశాంత్, ఎంఈవో అబ్దుల్ కరీం, ఎంపీటీసీలు భక్తవత్సలరెడ్డి, సుబ్రహ్మణ్యం, సర్పంచ్‌లు కాటంరెడ్డి సుధామణి, పరదేశి ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘం సొసైటీల ఛైర్మన్‌ల నియామకం

● నందికొట్కూరు సహకార సంఘం సొసైటీ ఛైర్మన్‌గా ముర్తుజావలి

నందికొట్కూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని వ్యవసాయ సహకార సంఘం సొసైటీలకు త్రిసభ్య కమిటీ నామినేటెడ్ పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 468 సొసైటీలకు ఛైర్మన్‌తో పాటు మరో ఇద్దరు సభ్యులను నియమిస్తూ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కార్యాలయం నుంచి జీవో విడుదలైంది.



ముర్తుజావలి

అందులో నందికొట్కూరు నియోజకవర్గంలో 5 సహకార సంఘం సొసైటీలకు త్రీమెన్ కమిటీలను నియమించారు.

- నందికొట్కూరు సహకార సంఘం సొసైటీ ఛైర్మన్‌గా ఎస్. ముర్తుజావలి, సభ్యులుగా కె.మద్దిలేటి, బి. నారాయణ ఎన్నికయ్యారు.
- పగిడ్యాల సహకార సంఘం సొసైటీ ఛైర్మన్‌గా దామోదర్ రెడ్డి, సభ్యులుగా తెలుగు పల్లె గంగన్న, కె. శంకర్‌లను నియమించారు.
- మిడ్తూరు మండలంలోని పీర్‌సాహెబ్ పేట సహకార సంఘం సొసైటీ ఛైర్మన్‌గా ఆర్.వెంకటేశ్వరరెడ్డి, సభ్యులుగా ధనుంజయరెడ్డి, డి. అబ్దుల్లాలు నియమితులయ్యారు.
- పాములపాడు మండలంలోని మద్దూరు సహకార సంఘం సొసైటీ ఛైర్మన్ కమ్మిరెడ్డి జనార్ధన్‌రెడ్డి, సభ్యులు బసిరెడ్డి అరుణమ్మ, పి.వీరకృష్ణుడులు నియమితులయ్యారు.
- కొత్తపల్లి మండలం నాగంపల్లి సహకార సంఘం సొసైటీ ఛైర్మన్‌గా బి.నాగేశ్వరరావు, సభ్యులుగా కె.రాధాకృష్ణారెడ్డి, జె.హుసేనయ్యలు నియమితులయ్యారు

అధిక రసాయణ ఎరువుల వాడకం తగ్గించాలి

నందికొట్కూరు రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : రైతులు విచక్షణారహితంగా అధిక రసాయనిక ఎరువులను వాడుతున్నారని వాటిని తక్షణమే తగ్గించాలని అలాగే భూసార పరీక్షల ఆధారంగా ఎరువులను వాడుకోవాలని నందికొట్కూరు వ్యవసాయ సంచాలకులు గిరీష్, మండల వ్యవసాయ అధికారి షేక్షావలి రైతులకు సూచించారు. బుధవారం నందికొట్కూరు మండలంలోని 10 బొళ్ళవరం, మల్యాల గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. నూతన వ్యవసాయ పద్ధతులను పాటించినప్పుడే అధిక దిగుబడులు సాధిస్తారని రైతులకు సూచించారు. కార్యక్రమంలో రైతు సేవాకేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా దేశవ్యాప్త సమ్మె

● జిల్లా వ్యాప్తంగా నిరసనలు చేపట్టిన కార్మిక సంఘాలు

ఆత్మకూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులను కాలరాసే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని గురువారం దేశవ్యాప్తంగా తలపెట్టిన ఆత్మకూరులో ప్రశాంతంగా సాగింది. సీఐటీయూ ఆధ్వర్యంలో వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు, కార్మికులు కలిసి స్థానిక సీపీఎం కార్యాలయం నుంచి గౌడ్‌సెంటర్, ఆర్టీసీ బస్టాండ్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. అక్కడ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా నిరసనలు చేపట్టారు. అనంతరం సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏసురత్నం, పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, అధ్యక్షులు రజాక్, ఎల్ఐసీ యూనియన్ నాయకులు విజయ్‌కుమార్, రవికుమార్, కైలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ.. 8గంటల పని విధానాన్ని 10 గంటలకు పెంచుతూ నిర్ణయం తీసుకోవడం సరికాదని అన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మికులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర పెద్దలు కార్మిక సంక్షేమాన్ని విస్మరించి కార్పొరేట్ వ్యక్తులకు మేలు జరిగేలా సంస్కరణలు తీసుకురావడం సిగ్గుచేటని విమర్శించారు. పనిగంటల పెంపు విధానాన్ని వెంటనే విరమించుకోవాలని అప్పటివరకు ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ మనోహర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సమావేశంలో ఆయా సంఘాల నాయకులు రణధీర్, వలి, సురేంద్ర, మంజుల, ప్రియాంక, లక్ష్మీదేవి, నాగరాజు, నాగన్న, తిమ్మయ్య, మాబాషా, వీరన్న తదితరులు ఉన్నారు.

నంద్యాల రూరల్: కేంద్ర ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరే విధానాలను మానుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రమేశ్‌బాబు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధత్యక్షురాలు నాగరాణి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. బుధవారం కార్మిక రైతు సంఘాల ఆధ్వర్యంలో టెక్కె మార్కెట్ యార్డు నుంచి గాంధీచౌకు వరకు బారీగా ర్యాలీ చేపట్టారు. వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ విధానాలను తప్పుబట్టారు. కార్మికుల హక్కులను కాలరాస్తు 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్లుగా కుదింపు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు.

మహానంది: దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా బుధవారం మహానంది మండలంలో మహిళ సంఘాల నేతలు ధర్నా నిర్వహించారు. వీవోఏల సంఘం జిల్లా అధ్యక్షుడు నందిపల్లి సోమన్న మహానంది ప్రధాన కూడలిలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి ధర్నా చేశారు. మండల రెవెన్యూ కార్యాలయం చేరుకొని వీఆర్వో చలమయ్యకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు శంకరయ్య, వీవోఏల సంఘం మహిళా అధ్యక్షురాలు సుమిత్ర, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాళ్లు సావిత్రి, నారాయణమ్మ పాల్గొన్నారు.

నందికొట్కూరు: కార్మిక, కర్షకుల పరిరక్షణే ధ్యేయంగా ఉద్యమాలు చేపడతామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నాగేశ్వరరావు అన్నారు. బుధవారం లేబర్‌కోడ్స్ రద్దు, కార్మిక చట్టాల పునరుద్ధరణకై వామపక్ష పార్టీలు పిలుపునిచ్చిన దేశ వ్యాప్త సమ్మెను నందికొట్కూరు పట్టణంలో సీఐటీయూ కార్మిక, కర్షక సంఘాలు, ఏఐసీసీటీయూ-సీపీఐ(ఎంఎల్) లిబరేషన్, ఐఎఫ్‌టీయూ నిరసన చేపట్టారు.

- కార్మిక, కర్షకుల సమస్యలు పరిష్కారం చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. నందికొట్కూరు పట్టణంలోని సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కొత్త బస్టాండ్ నుంచి పటేల్ సెంటర్ వరకు ర్యాలీగా వెళ్లి నిర్వహించి అక్కడ రాస్తారోకో నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు గోపాలకృష్ణ, ప్రజా సంఘాల నాయకులు ఉస్మాన్‌బాషా, మదర్‌బీ, నజురున్నిస్సా, కొంగర వెంకటేశ్వర్లు, దూదేకుల బాబు, సంపంగి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.
- కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ ఏఐసీసీటీయూ, ఐద్వా, ఐసా ఆధ్వర్యంలో నందికొట్కూరు పట్టణంలో సమ్మె నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ(ఎంఎల్)లిబరేషన్ నాయకులు వెంకటేశ్వర్లు, ఐసా ఉమ్మడి జిల్లా కార్యదర్శి నాగార్జున పాల్గొన్నా రు.
- కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సార్వత్రిక సమ్మెను భారత కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి అరుణ్ కుమార్, జిల్లా అధ్యక్షులు మజీద్ మియ్యాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు.

కొత్తపల్లి: కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెస్తున్న నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ మహిళా మండల కార్యదర్శి హరిత, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు మహేశ్వరి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నక్క స్వాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం వారు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, వినతి పత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్లు పెద్దన్న, అరుణలకు అందజేశారు.

బండిఆత్మకూరు: కేంద్ర ప్రభుత్వం తక్షణమే లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు రత్నమయ్య, రాజు, వ్యకాస నాయకులు డేవిడ్, సుబ్బరాయుడు డిమాండ్ చేశారు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ పద్మావతమ్మకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో భాగ్యమ్మ, వెంకటరమణమ్మ, సుశీలమ్మ, వసంత, సువర్ణ, మహేశ్ పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: అసంఘటిత రంగాలలో పనిచేస్తున్న కార్మికులకు కనీసవేతనం రూ.26వేలు ఇవ్వాలని, ఉద్యోగభద్రత కల్పించాలని, ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని సీపీఎం నాయకులు కర్ణ, రాము అన్నారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా బుధవారం అంగన్వాడీ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం వినతిపత్రాన్ని తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్‌కు అందజేశారు.

నందికొట్కూరు రూరల్: కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వామపక్ష జిల్లా నాయకులు నాగేశ్వరావు, సీఐటీయూ జిల్లా నాయకులు గోపాలక్రిష్ణ డిమాండ్ చేశారు. బుధవారం నందికొట్కూరు తహసీల్దార్ కార్యాలయం నాయకులు ధర్నా నిర్వహించి, తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రాన్ని అందజేశారు.

నంద్యాల హాస్పిటల్: ప్రభుత్వ రంగ సంస్థలను, కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసే కేంద్ర ప్రభుత్వ విధానాలను తక్షణం విరమించుకోవాలని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం కడప డివిజన్ ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం అధ్యక్షుడు అవధానం శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక డివిజన్ కార్యాలయం ఎదుట సమ్మె చేశారు. సమ్మెకు లియాఫీ నాయకులు ఎం.శ్రీనివాసరెడ్డి, తిరుపాలు, ఎంకే రామచంద్రమూర్తి, జె.రామాంజనేయులు, కుమ్మిత శ్రీనివాసులు సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో నంద్యాల ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి ఎ.రమేష్‌బాబు, యూనియన్ నాయకులు బి.హరిప్రియ, భువనేంద్ర, పీసీ రామకృష్ణుడు, షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

గడివేముల: అంగన్‌వాడీ, ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు నరసింహనాయక్ అన్నారు. మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన వీవోఏలు, ఆటో కార్మికులు ధర్నా చేశారు. గడివేముల పాతబస్టాండు సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. తహసీల్దార్ వెంకటరణమకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు వసంతమ్మ, రాములమ్మ, ఆశా వర్కర్స్ నాయకులు చెన్నమ్మ, ఆశాబి, మహేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరులో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేస్తున్న కార్మిక సంఘాలు



నందికొట్కూరులో...



మహానందిలో ర్యాలీ చేస్తున్న ఆశావర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు



కొత్తపల్లిలో..



నంద్యాలలో ర్యాలీ చేస్తున్న కార్మిక సంఘం నాయకులు

ఆత్మకూరు రూరల్: ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న విధానాలను తక్షణం విడనాడాలని ఆత్మకూరు ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు విజయ్‌కుమార్, రవికుమార్, సీఐటియు జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయం ఎదుట దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ఎల్ఐసీ ఉద్యోగులు ధర్నా నిర్వహించి, నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఆ యూనియన్ నాయకులు నాగన్న, నాగేంద్రకుమార్, అమీర్, జబివుల్లా, శోభారాణి, సుచిత్ర, చంద్రశేఖర్, ఇస్మాయిల్, ప్రవీణ్,భాస్కర్ లియాఫి నాయకులు కరీం, స్వామిదాసు పాల్గొన్నారు.

వెలుగోడు: ప్రభుత్వం లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని కార్మిక సంఘాల నాయకులు హెచ్చరించారు. బుధవారం సిఐటియూ ఆధ్వర్యములో జాతీయ సమ్మెలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దారు శ్రీనివాసగౌడుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమములో వెంకటయ్య, నాగమోహన్, రఫీ, వరలక్ష్మమ్మ, సుమిత్ర, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సరైన ఆధారాలు ఉంటే భూమి వదిలేస్తా

నంద్యాల టౌన్ జూలై 9(ఆంధ్రజ్యోతి): నంద్యాల మండలం రైతు నగరంలోని 5.61 ఎకరాల భూమి తనదని స్థానిక వైద్యుడు మధుసూదన్‌రావు అంటున్నాడని, అందుకు సంబంధించిన పత్రాలు తమ పూర్వీకుల నుంచి కొన్నట్లుగా ఉంటే ఆ భూమిని వదిలేస్తానని కత్తి శ్రావణి అన్నారు. బుధవారం స్థానిక రైతునగరంలో ఆమె మాట్లాడుతూ.. రూ.30కోట్లు విలువ చేసే ఈ భూమిని దౌర్జన్యంగా డ్యాకుమెంట్లు పుట్టించి స్వాధీనం చేసుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. తమకు సహకరించిన వారిపై కూడా అక్రమంగా కేసులు నమోదు చేయడం ఏంటని ప్రశ్నించారు. 1956 నుంచి తమ పూర్వీకుల పేరు మీద భూమి ఉందని, వారు ఎవ్వరికీ దాన్ని అమ్మలేదన్నారు. అమ్మినట్లు నిరూపిస్తే భూమిని వదిలేస్తానని అన్నారు.



మాట్లాడుతున్న కత్తి శ్రావణి

మత్తు పదార్థాలు విక్రయిస్తే చర్యలు

బండిఆత్మకూరు జూలై 9(ఆంధ్రజ్యోతి): వ్యాపారులు తమ దకాణాల్లో మత్తుపదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ జగన్మోహన్ హెచ్చరించారు. బుధవారం మండలంలోని బండిఆత్మకూరు గ్రామంలో వ్యాపార దుకాణాల్లో తనిఖీలు చేశారు. పాఠశాలలకు సమీపంలో ఉన్న బంకులు, దుకాణాల్లో మత్తు పదార్థాలను విక్రయిస్తే జైలుపాలు అవుతారని అన్నారు.

ఫొటో ఆధారంగానే చీడ పీడల నివారణ

బండిఆత్మకూరు జూలై9 (ఆంధ్రజ్యోతి): రైతులు తమ పంటలను ఫొటో తీసి పంపితే చాలు పైరుపై ఆశించిన చీడ, పీడలను వ్యవసాయ నిపుణుల చేత గుర్తిస్తారని ఏవో పవన్‌కుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని కడమలకాల్వ, ఈర్నపాడు గ్రామాల్లో ఆయన పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ ప్రతి రైతు సాగు చేసిన పంటలకు బీమా చేయించుకోవాలని ఏవో సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది స్వామోట్, నాగరాజు పాల్గొన్నారు.

నేడు గురుపౌర్ణమి

ఆత్మకూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలో వెలసిన షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం జరిగే గురుపౌర్ణమి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లను పూర్తి చేసింది. గురువారం ఉదయం 6గంటలకు కాకడహారతి, 7.30గంటలకు నవవిధ అభిషేకాలు, పుష్పార్చన, 9గంటలకు శ్రీసాయిసత్యవ్రతము జరపనున్నారు. 10.30గంటలకు స్వామివారు ప్రత్యేక అలంకరణతో భక్తులకు దర్శనమివ్వనున్నారు. అదేవిధంగా 12గంటలకు మధ్యాహ్న హారతి, రాత్రి 9గంటలకు శేజహారతితో వేడుకలకు ముగింపు పలకనున్నారు. కాగా గురుపౌర్ణమిని పురస్కరించుకుని విచ్చేయు భక్తులకు మధ్యాహ్నం 11.30గంటల నుంచే అన్నదాన కార్యక్రమం, రాత్రి 9గంటలకు శేజహారతి చేపట్టనున్నారు. సాయంత్రం రథోత్సవం నిర్వహిస్తున్నారు.



గురుపౌర్ణమికి ముస్తాబైన సాయిబాబా ఆలయం

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

నంద్యాల టౌన్ జూలై 9(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని 38వ టీడీపీ ఇన్‌చార్జి తాటికొండ బుగ్గరాముడు పేర్కొన్నారు. బుధవారం స్థానిక వైఎస్సార్ నగర్‌లో శాంతిరాం మెడికల్ కళాశాల, జనరల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం రావడంతో చెత్త చెదారం నీరు కలుషితం అయ్యే అవకాశం ఉందని ఆనారోగ్య సమస్యలు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అనంతరం అక్కడికి వచ్చిన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో వైద్యులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

గడివేముల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి లలితాబాయి అన్నారు. మండలంలోని బిలకలగూడురు గ్రామంలో పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించాలని అన్నారు. మురికి కాలువలను శుభ్రపరచాలని అన్నారు. తాగునీటిలో కలుషిత నీరు కలవకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. పీజీఆర్ఎస్ ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అన్నారు. ప్రజలకు పారిశుధ్యం, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో మహిధర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ పాల్గొన్నారు.

నేడు శ్రీశైలంలో గిరి ప్రదక్షణ

నంద్యాల టౌన్ జూలై 9(ఆంధ్రజ్యోతి): పౌర్ణమి సందర్భంగా శ్రీశైల గిరి ప్రదక్షణ కార్యక్రమాన్ని దేవస్థానం వారు సంప్రదాయంగా నిర్వహిస్తామని ఆలయం ఈవో శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. గురువారం సాయంత్రం స్వామి అమ్మవార్ల మంగళహారతి అనంతరం శ్రీగిరి ప్రదక్షణ ప్రారంభమవుతుందన్నారు.ఆలయం ముఖ ద్వారం నుంచి మొదలై గంగాధర మండపం, అంకాలమ్మ ఆలయం, నంది మండపం, గంగాసదనం మీదుగా బయలు వీరభద్రస్వామి ఆలయం వద్దకు చేరుకుంటుందని తెలిపారు. ఈ బయలుదే రి మాడ వీధుల గుండా చివరకు రుద్రవనంలోకి చేరుకుని అక్కడి నుంచి నంది మండపానికి రావడంతో గిరి ప్రదక్షణ ముగుస్తుందని ఆయన తెలిపారు.

అంకాళమ్మకు బోనం సమర్పణ

శ్రీశైలం మహాక్షేత్ర గ్రామ దేవతఅయిన అంకాలమ్మ అమ్మవారికి దేవస్థానం తరఫున బోనం సమర్పించినట్లు ఆలయం ఈవో శ్రీనివాసరావు తెలిపారు. అనంతరం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ఆలయం ఈవో ప్రధాన అర్చకులు నాగేశ్వరశాస్త్రి పలువురు కలిసి వేదపండితులు సంప్రదాయంగా నూతన పట్టు వస్త్రాలు, గాజులు, పండ్లు పుష్పాలు అందజేసి బోనం అందజేశారు.

- శ్రీశైలం దేవస్థానం వారు నిర్వహిస్తున్న శాశ్వత అన్నదాన పథకానికి రూ.100500 హైదరాబాద్‌కు చెందిన బి. త్రిపుర పర్యవేక్షకురాలు హిమబిందుకు అందజేశారు. అనంతరం దేవస్థానం నుంచి వారికి తీర్థప్రసాదాలు అందజేశారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు

మహానంది, జూలై 9 (ఆంధ్రజ్యోతి): దైవదర్శనం కోసం క్షేత్రానికి వచ్చే భక్తులకు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పిస్తామని మహానంది ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి మద్రమల్ల మధు అన్నారు. బుధవారం క్షేత్ర పరిధిలోని తిరుమల తిరుపతి దేవస్థానం నిర్మించిన వసతి గృహంలో జరుగుతున్న తాత్కాలికంగా అభివృద్ధి పనులను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా వసతి గృహాలను తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఈవో, ఇన్‌చార్జి పర్యవేక్షకుడు పసుపుల సుబ్బారెడ్డి ఉన్నారు.

అమ్మవారికి సారె



మహానందిలో కామేశ్వరీదేవి అమ్మవారికి చీరె,సారె సమర్పిస్తున్న మహిళా భక్తులు

మహానంది: మహానంది క్షేత్రంలోని కామేశ్వరీదేవి అమ్మవారికి దేవస్థానం సిబ్బంది కాలనీ, ఈశ్వర్‌నగర్‌కు చెందిన మహిళలు బుధవారం భక్తి శ్రద్ధలతో సారెను అందచేశారు. ఆలయం ముఖమంటపం వద్ద వీరికి పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ రవిశంకర్ అవధాని, నాగేశ్వరశర్మ, హనుమంత్‌శర్మలు స్వాగతం పలికారు. అనంతరం మహిళలు పూజలు నిర్వహించారు.

నంద్యాల కల్చరల్: ప్రపంచంలోనే 2వ నంద్యాల జగజ్జనీ అమ్మవారికి భక్తులు అమ్మవారికి చీరె సారె సమర్పించారు. జగజ్జనీ అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. దుర్గా ఫ్రెండ్స్ యూనిట్ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు: ఎమ్మెల్యే



కోనేటమ్మపల్లెలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జయసూర్య.

నందికొట్కూరు రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటటుందని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య తెలిపారు. బుధవారం నందికొట్కూరు మండలంలోని కోనేటమ్మపల్లె గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ఎమ్మెల్యే జయసూర్య, కార్యకర్తలు నాయకులతో కలిసి గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందజేసే సంక్షేమపథకాలను వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దామోదరెడ్డి, మార్కెట్ యార్డు ఛైర్మన్ వీరం ప్రసాదరెడ్డి, వెంకటేశ్వర్లు, ఉదయకిరణ్‌రెడ్డి, సింగిల్ విండో మాజీ ఛైర్మన్ మద్దూరు హరిసర్వోత్తమరెడ్డి. తదితరులు పాల్గొన్నారు.

మిడుతూరు: చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రం అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. బుధవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని మాసపేట నిర్వహించారు. ఏడాదిలో చేపట్టిన పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో దశరథరామయ్య, తహసీల్దార్ శ్రీనివాసులు, టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి, రాజ శేఖర రెడ్డి, వీరారెడ్డి వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తాం

- శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి



ఆత్మకూరులో ఇంటింటికి సుపరిపాలన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బుడ్డా

ఆత్మకూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలన్ని నెరవేరుస్తామని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బుధవారం కూటమి ప్రభుత్వం ఏడాది పాలనను పురస్కరించుకుని ఆత్మకూరు పట్టణంలోని 5వ వార్డులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శ్రీశైలం ఎమ్మెల్యేయ బుడ్డా ఇంటింటికి పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ శ్రీశైల నియోజకవర్గంలో ఏడాదిలోనే రూ.150కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్రజలకు మెరుగైన సదుపాయాలను కల్పించేందుకు అన్ని విధాలుగా పాటుపడుతానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అబ్దుల్లాపురం బాషా, నాగూర్‌ఖాన్, షాబుద్దిన్, ఖాజమోద్దిన్, సద్దాం, నజీర్‌అహ్మద్, న్యామతుల్లా, అన్సర్, సుబ్బయ్య, అష్రఫ్ అలి, మునీర్, పెయింటర్ రఫీక్, జలీల్, నబిరసూల్ తదితరులు ఉన్నారు.

కొత్తపల్లి: టీడీపీ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేసిందని టీడీపీ మండల కన్వీనర్ నారపురెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి లింగస్వామి గౌడు అన్నారు. బుధవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని మండలంలోని సింగరాజుపల్లి, చిన్నగుమ్మడాపురం, పెద్ద గుమ్మడాపురం గ్రామాల్లో నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ నక్కా విజయకుమార్, మాజీ మండల కన్వీనర్ జడ్.వెంకటరెడ్డి, యూనిట్ ఇన్‌చార్జి వెంకటస్వామిరెడ్డి, నాయకులు బుచ్చిరెడ్డి, శివారెడ్డి, మల్లయ్య, ఏ.దర్గయ్య, రాము, ఎల్ఐసీ దరగయ్య పాల్గొన్నారు.

భక్తుల కోసం వాటర్ ప్లాంట్ ఏర్పాటు

- మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి



సాయిబాబా ఆలయంలో ప్లాంటును ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, జూలై 9 (ఆంధ్రజ్యోతి): భక్తుల కోసం ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తామని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. బుధవారం పట్టణ శివారులోని ఎస్సార్బీసీ కాలనీ సాయిబాబా ఆలయంలో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌ను బీసీ రాజారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తల్లిదండ్రులు బీసీ లక్ష్మమ్మ, బీసీ గుర్రెడ్డిల జ్ఞాపకార్థం పట్టణ పరిధిలోని ప్రార్థనా మందిరాల్లో సొంతనిధులతో వాటర్‌ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. తాగునీటిని వృథా చేయకుండా వాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ శ్రీరామ సుబ్రమణ్యం, సభ్యులు బలరాం, గాధంశెట్టి వేణుగోపాల్, గుండా శ్రీనివాసులు, వై.మద్దిలేటిరెడ్డి, మిట్టపల్లె సర్పంచ్ తులసిరెడ్డి, గుండా రవికుమార్, జక్కానాగరాజు, బచ్చు శరత్‌చంద్రకుమార్, బచ్చురమేశ్, చిత్తలూరు ప్రసాద్, ముత్తుకూరు జీత్‌కుమార్‌ర, శివయ్య, శ్రీనివాసరారా, సాయిరం, మధు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

యాగంటి క్షేత్రంలో హుండీ లెక్కింపు

బనగానపల్లె, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యాగంటి ఉమామహేశ్వరస్వామి క్షేత్రంలో బుధవారం ఈవో పాండు రంగారెడ్డి ఆధ్వర్యంలో హుండీ లెక్కించారు. ఈ ఏడాది మార్చి 20 నుంచి జూలై 9వరకు హుండీ ద్వారా రూ. 20.90లక్షలు ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. బనగానపల్లె తనిఖీ అధికారి హరిశ్చంద్రారెడ్డి సమక్షంలో హుండీని లెక్కించారు. కార్యక్రమంలో శ్రీరామసమితి , శ్రీబాలాజీ సేవా సమితి సేవకులు, భక్తులు పోలీస్ సిబ్బంది, హెచ్‌డీఎఫ్‌సీ సిబ్బంది, బండి మౌళీశ్వరరెడ్డి, పాతపాడు శంఖేశ్వరరెడ్డి, భరతుడు, ఆలయ అర్చకులు మహేశ్‌శర్మ, ఆలయ సిబ్బంది ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు నాటక ప్రదర్శన

కొలిమిగుండ్ల, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం నాటక ప్రదర్శన, పాడుతా తీయగా పాటల కార్యక్రమం, భజనలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వీడీ రాజగోపాల్ బుధవారం వెల్లడించారు. గురుపౌర్ణిమ వేడుకల్లో భాగంగా సాయి మందిరంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అన్నదానం ఏర్పాటు చేశామన్నారు. రాత్రికి పౌరాణిక నాటక ప్రదర్శన ఉంటుందన్నారు.

ఇద్దరు ఎంపీలు రాక

నంద్యాల, అనంతపురం ఎంపీలు డాక్టర్ శబరి, అంబికా లక్ష్మీనారాయణ నేడు కొలిమిగుండ్లకు వస్తున్నారని షిర్డీ సాయి సేవా ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ వీడీ రామకృష్ణ బుధవారం వెల్లడించారు. స్థానిక గురుపౌర్ణిమ వేడుకల్లో పాల్గొనడంతో పాటు, కొలిమిగుండ్ల హైస్కూల్ జరిగే మెగా పేరెంట్స్ డే కార్యక్రమానికి హాజరవుతారని తెలిపారు.

ఎన్నికల నియమావళిని తెలుసుకోవాలి

చాగలమర్రి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): బీఎల్‌వోలు ఎన్నికల నియమావళిని తెలుసుకోవాలని ఆర్డీవో విశ్వనాథ్ అన్నారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బుధవారం చాగలమర్రి కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో బూత్‌లెవెల్ ఆఫీసర్ల శిక్షణా కార్యక్రమాన్ని ఆర్డీవో ప్రారంభించారు. బీఎల్‌వోల విధులు, ఎన్నికల విధులు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఇన్‌చార్జి తహసీల్దార్ విజయ్‌కుమార్, మాస్టర్ ట్రైనర్ సునీల్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

పంచాయతీ పురోగతిపై సమీక్ష

దొర్నిపాడు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): దొర్నిపాడు మండలపరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయా శాఖల అధికారులకు పంచాయతీ పురోగతిపై సమీక్షా సమావేశాన్ని ఎంపీడీవో సావిత్రి ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య
- దేశవ్యాప్త సమ్మె ప్రశాంతం



బేతంచెర్లలో ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

డోన్ రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయకపోతే కేంద్ర ప్రభుత్వానికి భవిష్యత్తులో కార్మికుల చేతిలో పతనం తప్పదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య హెచ్చరించారు. బుధవారం దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా డోన్ పట్టణంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సుంకయ్య మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న కార్మికుల చట్టాలను రద్దు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ అనుబంధ సంఘాల నాయకులు అన్వర్, అబ్బాస్, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జులేఖ, వెంకటేశ్‌గౌడు, పుల్లయ్య, సురేంద్ర, వెంకటేశ్, భాస్కర్ పాల్గొన్నారు.

● సీఐటీయూ ఆధ్వర్యంలో..

పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా చేపట్టిన నిరసన కార్యక్రమం ప్రశాంతంగా జరిగింది. సీఐటీయూ కార్యాలయం నుంచి ప్రధాన రోడ్డులో ర్యాలీగా వచ్చి తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ నాయకులు ఆందోళనలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, సీఐటీయూ అనుబంధ సంఘాల నాయకులు నక్కి శ్రీకాంత్, శివరాం, మద్దయ్య, రామాంజనేయులు, నాగ మద్దయ్య, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యం శెట్టి తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లె: కార్మికులకు వ్యతిరేకంగా కేంద్రప్రభుత్వం తీసుకువచ్చిన వివాదాస్పద చట్టాలను వెంటనే ఉపసంహరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దారు నారాయణరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ డివిజన్ కార్యదర్శి సుబ్బయ్య, అంగన్‌వాడీ కార్యదర్శి రోజారమణ, హేమలత, మహేశ్వరి, ఆటో, హమాలీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను వెంటనే విడనాడాలని సీపీఎం నాయకులు దావీదు డిమాండ్ చేశారు. బుధవారం దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా కొలిమిగుండ్లలో వివిధ వర్గాల కార్మికులు, సీఐటీయు కార్యకర్తలు, అంగన్‌వాడీలు, ఆటోవాలాలు తదితరులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో డీటీకి వినతిపత్రం అందించారు. పోలీసులు ప్రత్యేక బందోవస్తు నిర్వహించారు.

కొవెలకుంట్ల: పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో జమ్మలమడుగు సర్కిల్ నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు భారీగా పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ సందర్భంగా గ్రామ పంచాయతీ సర్కిల్ నందు మానవహారం నిర్వహించారు. నాయకులు కరీంబాషా, సుధాకర్, వెంకటేశ్, వెంకటలక్ష్మి, సరస్వతి, అరుణ, శివనాగలక్ష్మి, పుల్లమ్మ, రఘు, రాజు, శ్రీను, భాస్కర్, రాజు, బాలయ్య, సుబ్బారెడ్డి, మహేశ్ పాల్గొన్నారు.

చాగలమర్రి: ఆశాలు, అంగన్‌వాడీ వర్కర్లు బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సభ్యులు పాల్గొన్నారు.

రుద్రవరం: రుద్రవరంలో సీఐటీయూ కార్మిక సంఘం, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో అంగన్‌వాడీ, ఆశా, ఆటో కార్మికులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామచంద్రుడు, శంకర్, గంగయ్య ఉన్నారు.

సంజామల: సంజామలలో జరిగిన సార్వత్రిక సమ్మెలో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఆర్ నాయక్, అంగన్‌వాడీ నాయకురాలు, కార్యకర్తలు, పాల్గొన్నారు. ఎంపీడీవో కార్యాలయం నుంచి బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించి మానవహా రంగా ఏర్పడి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి సుజాత , నాయకులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్రజా సంఘనాల నాయకులు, వివిధ శాఖల సిబ్బందితో కలిసి ధర్నా నిర్వహించారు. రెవెన్యూ అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు శ్రీని వాసులు, వివిధ సంఘాల నాయకులు, అంగన్‌వాడీ టీచర్ల, హెల్త్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అవుకు: ఏపీ మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ డిమాండ్లను నెరవేర్చాలని యూఎంహెచ్‌ఈ జిల్లా ట్రెజరర్ వెంకటేశ్వరమ్మ విజ్ఞప్తి చేశారు. బుధవారం వైద్య సిబ్బంది నిరసన వ్యక్తం చేసి తహసీల్దార్ మల్లికార్జునరెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది జ్యోష్న, దానమ్మ, శారద, ఆకుమల్ల, అవుకు, ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బేతంచెర్ల: పట్టణంలోని కొత్తబస్టాండు నుంచి పాతబస్టాండు వరకు కార్మికులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లయ్య, సీపీఎం మండల ప్రధాన కార్యదర్శి మధుశేఖర్, పట్టణ కార్యదర్శి వెంకటేశ్వర్లు, నాయకులు ఎం. మధుశేఖర్, వైబీ వెంకటేశ్వర్లు, ఎల్లయ్య, ఎస్.రహంతుల్లా, ఎన్వీ రమణ, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు. అలాగే ఎస్‌బీఐ ముందు పలు సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు తిరుమలేష్, భార్గవ్ యన్నా, పి.నాగరాజు, దస్తగిరి, ఉదయ్, రామాంజనేయులు, ఎల్లకృష్ణ, మధు, భాస్కర్ ధనుంజయ, మారుతి, శివ గోపాల్, శ్రీను, నాయుడు, ఏసన్న, రామదాసు, జేబీవుల్లా, రవి, శేఖర్, మనోజ్ పాల్గొన్నారు.



బనగానపల్లెలో తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ టీచర్లు



కొవెలకుంట్లలో గ్రామ పంచాయతీ సర్కిల్‌లో మానవహారం నిర్వహిస్తున్న కార్మికులు



చాగలమర్రి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఆశలు, అంగన్‌వాడీలు

అభివృద్ధి, సంక్షేమం చంద్రబాబు లక్ష్యం

● డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి



ప్యాపిలిలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోట్ల

ప్యాపిలి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమం సీఎం చంద్రబాబు లక్ష్యమని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఏనుగమర్రి, ప్యాపిలి, పోతుదొడ్డి, గుడిపాడు గ్రామాల్లో నిర్వహించిన సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రాష్ట్రం అధోగతి పాలైందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు ప్రజలకు మెరుగైన పాలన అందిస్తున్నారన్నారు. అనంతరం గ్రావ నాల్లో ఇంటింటా తిరిగి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, డీసీఎంఎస్ చైర్మన్ వై నాగేశ్వరరావుయాదవ్, ప్రభాకర్‌రెడ్డి, వై లక్ష్మీనారాయణయాదవ్, టి శ్రీనివాసులు, రాజా నారాయణమూర్తి, ఖజాపీర్, మోపూరి రామక్రిష్ణ, అలేబాదు పరమేష్, ఆర్ఈ నాగరాజు, సుదర్శన్, రాజా రవి, శంకర్, రాము, రామ్మోహన్‌యాదవ్, మధుకుమార్, సూర్యనారాయణగౌడు, కదిరెప్ప పాల్గొన్నారు.

బనగానపల్లె: మండలంలోని మీరాపురం గ్రామంలో బుధవారం టీడీపీ నాయకులు తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నారాయణరెడ్డి, గోపి, ఓబుళరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై ప్రజలకు ఎంతో నమ్మకం

- ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే అఖిలప్రియ

ఆళ్లగడ్డ, జూలై 9(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలోనే ఎన్నో పథకాలను అమలు చేయడంతో ప్రజలకు ఎంతో నమ్మకం ఏర్పడిందని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. బుధవారం పట్టణంలోని వీవర్స్ కాలనీలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల అమలు, ఎంతవరకు అందాయని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రభుత్వ పథకాలకు సంబంధించిన కర పత్రాలను అందజేశారు. అనంతరం కాలనీలో రూ 10 లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ హుసేన్‌బాష, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలను కించపరిచేలా మాట్లాడితే సహించం

మహిళలు సమాజంలో ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొని రాజకీయాల్లో ముందుకొస్తుంటే వారిని కించపరిచేలా మాట్లాడితే సహించేది లేదని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ హెచ్చరించారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. వైసీపీ మాజీ ఎమ్మెల్యే ప్రసన్న కుమార్‌రెడ్డి కోవూరు ఎమ్మెల్యే వేములవాడ ప్రశాంతిరెడ్డిపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం హేయనీయమన్నారు. ఏ పార్టీ వారైన సరే మహిళల గురించి తప్పుగా మాట్లాడితే వారి పై ప్రభుత్వం కఠిన శిక్షలు విధించాని కోరారు.

పురోగతిలో భాగస్వాములు కావాలి

కొవెలకుంట్ల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలో పురోగతిలో అందరూ భాగస్వాములు కావాలని ఎంపీడీవో వరప్రసాదరావు, డిప్యూటీ ఎంపీడీవో ప్రకాశ్‌నాయుడు కోరారు. బుధవారం పట్టణంలోని రైతు సేవా కేంద్రంలో మండలస్థాయి సచివాలయ సిబ్బంది, గ్రామస్థాయి అధికారులతో గ్రామ పంచాయతీ పురోగతి సూచికపూ అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఏవో సుధాకర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికుమార్‌రాజు, పీఆర్ ఏఈ చెంచయ్య, ఏబీఎం శేఖర్, ఐసీడీఎస్ సూపర్‌వైజరు చంద్రమ్మ, మెడికల్ ఆఫీసరు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు తనిఖీ

కొవెలకుంట్ల, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని భీమునిపాడు గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులను ఎంపీడీవో వర ప్రసాదరావు, డిప్యూటీ ఎంపీడీవో ప్రకాశ్‌నాయుడు తనిఖీ చేశారు. బుధవారం గ్రామానికి చేరుకుని పనులు పరిశీలించారు. పారిశుధ్య కార్మికులు అంకితభావంతో పనిచేయాలని వారు సూచించారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శి శారద ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో జియారత్

కొవెలకుంట్ల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గుల్లదుర్తి గ్రామంలో వెలసిన దస్తగిరిస్వామి, మౌలాలిస్వామి దర్గాలో బుధవారం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జియారత్ నిర్వహించారు. పీర్లకు ప్రత్యేక ఫతెహాలు సమర్పించి పూల దట్టీలు, వెండి గొడుగులు అలంకరించి ఊరేగించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పెరుగు మద్దిలేటి, తుమ్మల పెద్దదస్తగిరి, పల్లెనాగరాజు, పలగాలి డ్రైవరు హుసేని, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రుద్రవరం : రుద్రవరంలో మౌలాలి స్వామి జియారత్ బుధవారం నిర్వహించారు. మొహర్రంలో భాగంగా జియారత్ నిర్వహించారు. రుద్రవరం, నాగులవరం, అప్పనపల్లె, బోనంపల్లె, చిన్నకంబలూరు, కొండమాయపల్లె, కొత్తూరు, కొత్తపల్లె, తువ్వపల్లె, రామాపురం గ్రామాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి మౌలాలి స్వామికి పూలసేరాలు, వెండి గొడుగులు సమర్పించి భక్తిని చాటుకున్నారు.

ఆయిల్‌పామ్ సాగు లాభదాయకం

చాగలమర్రి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగు లాభదా యకమని ఆళ్లగడ్డ ఉద్యానశాఖ అధికారి దస్తగిరి తెలిపారు. బుధవారం చింతలచెరువు గ్రామంలో రైతు పొలంలో ఆయిల్‌పామ్ మొక్కలను నాటించారు. కార్యక్రమంలో వీహెచ్‌ఏలు, రైతులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు

చాగలమర్రి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువులతోనే అధి క దిగుబడులు సాధించవచ్చని ఏవో రంగనేతాజీ సూచించారు. బుధ వారం శెట్టివీడు, చింతలచెరువు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్ర మం నిర్వహించారు. మొక్కజొన్న, మినుము పంటల్లో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. పంటల భీమా నమోదు చేసుకోవాలని రైతులకు తెలియజేశారు.

నేటి నుంచి గౌస్‌పీర్‌షా ఖాద్రి ఉరుసు

చాగలమర్రి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రిలోని చిన్నమకానం వీధిలో వెలసిన గౌస్‌పీర్‌షా ఖాద్రి ఉరుసు ఉత్సవాలు గురువారం నుంచి నిర్వహిస్తున్నట్లు దర్గా పీఠాధిపతి సయ్యద్ లాల్‌మి యా ఖాద్రి బుధవారం తెలిపారు. 10న గంధం, 11న ఉరుసు, 12 జియారత్ కార్యక్రమాలు జరుగుతాయని అన్నారు.

చెంచుగూడెంలో వాటర్‌ట్యాంకు నిర్మాణం

రుద్రవరం, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని హరినగరం చెం చుగూడెంలో రూ.26.60 లక్షలతో వాటర్‌ట్యాంకు నిర్మాణం చేపడుతు న్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రమణ్యం తెలిపారు. బుధవారం పనులు పరిశీలించారు. చెంచులకు స్వచ్ఛమైన నీటిని అందించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. 40వేల లీటర్ల సామర్థ్యంతో ట్యాంకు నిర్మిస్తున్నట్లు ఏఈ తెలిపారు.

నేడు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి రాక

కొలిమిగుండ్ల, జులై 9 (ఆంధ్రజ్యోతి) : కొలిమిగుండ్లకు గురువారం మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి రానున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు రామేశ్వరరెడ్డి, ప్రచార కార్యదర్శి శివరామిరెడ్డి బుధవారం వెల్లడించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో జరిగే మెగా పేరెంట్స్ డేలో మంత్రి పాల్గొంటారని ఆయన వెల్లడించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

రుద్రవరం, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిలకలూరు మజరా లాలాయపేట గ్రామంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో బుధవారం దాడి చేసినట్లు ఎస్ఐ మహ్మద్‌రఫీ తెలిపారు. ఆరుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. వారి వద్ద రూ.9980 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చివరి ఆయకట్టుకు సాగు

రుద్రవరం, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని డి.కొట్టాల, శ్రీరంగాపురం సమీపంలో ఉన్న 17వ బ్లాక్‌ఛానెల్ చివరి ఆయక ట్టుకు సాగునీరందించేందుకు పనులు చేపట్టామని తెలుగుగంగ టీసీ చైర్మన్ నరసింహారెడ్డి అన్నారు. బుధవారం మరమ్మతు పను లు ప్రారంభించారు. పనులకు రూ.8లక్షలు మంజూరు అయినట్లు తెలిపారు. నాయకులు నాగిరెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

అల్ట్రాటెక్ సున్నపురాయికి ఫైవ్‌స్టార్ రేటింగ్

● కేంద్ర మంత్రి నుంచి అవార్డు అందుకున్న ప్రతినిధులు



కేంద్రమంత్రి నుంచి అవార్డు అందుకుంటున్న యూనిట్ హెడ్ సజ్జేంద్రకుమార్, నాగసిద్ధారెడ్డి

కొలిమిగుండ్ల, జులై 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తుమ్మలపెంట పరిధిలోని అల్ట్రాటెక్ సున్నపురాయి గనికి అరుదైన ప్రతిష్టాత్మక 5స్టార్ రేటింగ్ అవార్డు దక్కింది. రాజస్థాన్ జైపూర్‌లో జరిగిన ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి నుంచి అల్ట్రాటెక్ యూనిట్ హెడ్ సజ్జేంద్రకుమార్, మైన్స్ ఫంక్షన్ హెడ్ నాగసిద్ధారెడ్డి అవార్డు అందుకున్నారు. సుస్థిర మైనింగ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరచినందుకుగాను అల్ట్రాటెక్ వరుసగా మూడవ సారి సత్కారాన్ని సొంతం చేసుకుంది.

సన్నకారు రైతులకు వందశాతం సబ్సిడీ

రుద్రవరం, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం కింద ఐదెకరాల భూమిలోపు ఉన్న రైతులకు వందశాతం పండ్ల మొక్కలు ఉచితంగా అందిస్తున్నామని ఏపీవో గౌరీబాయి అన్నారు. మండలానికి వంద ఎకరాలు టార్గెట్ కాగా ఇప్పటి వరకు 30 ఎకరాలు గుర్తించామన్నారు. మరో 70 ఎకరాలు గుర్తించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈసీ సుబ్బన్న, సిబ్బంది ఉన్నారు.

పంట మార్పిడితో అధిక దిగుబడులు

దొర్నిపాడు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రతి ఏడాది పంట మార్పిడి చేయడం వల్ల తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారి ప్రమీల అన్నారు. బుధవారం మండలంలోని డబ్ల్యూకొత్తపల్లె, చాకరాజువేముల గ్రామాల్లో రైతులతో సమావేశం నిర్వహించారు. మినుము పంటలో రైతులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు ఉన్నారు.

'కార్మికులను వేధించడం సరికాదు'

బనగానపల్లె, జూలై 9, (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె ఆర్టీసీ డిపో మేనేజరు రవికిశోర్ ఏకపక్ష నిర్ణయాలతో కార్మికులను వేధించడం సరికాదని ఎన్ఎంయూ యూనియన్ నాయకులు అన్నారు. బుధవారం రెండోరోజు ఎర్రబ్యాడ్జీలు ధరించి ఆర్టీసీ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. డీఎం నిబంధనలకు వ్యతిరేకంగా కార్మికులకు వేధిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో డిపో ట్రెజరర్ జీ.వెంకటేశ్వర్లు, డిపో కార్యదర్శి శ్రీనివాసులు, ఎల్లయ్య, జమ్మలయ్య, ప్రహ్లాద, కంభన్న లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

డోన్ టౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్యాపిలి మండలం వెంకట నాయునిపల్లె గ్రామానికి చెందిన దళితులపై దాడి చేసినవారిని అరెస్టు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంధం శ్రీనివాసులు, నాయకులు ఆర్‌సీ మద్దిలేటి, ఉంగరానిగుండ్ల రాముడు, బాలన్న, రంగన్న డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్టు హౌస్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరులతో వారు మాట్లాడారు. ముందుగా డీఎస్పీ శ్రీనివాసులును కలిసి వినతి పత్రం అందజేశారు. సమావేశంలో రంగన్న, బాలు, ఆదినారాయణ, ఎల్ఐసీ క్రిష్టన్న, వెంకటేశ్ తదితరులున్నారు.

రైతుల ఖాతాల్లో డబ్బులు జమ

బేతంచెర్ల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): గాలి మరల ఏర్పాటు చేసే సంస్థ నుంచి ప్రతి రెండు నెలలకు ఒకసారి రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతాయని డోన్ ఆర్డీవో నరసింహులు సూచించారు. బుధవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ముద్దవరం, ఎం.పెండేకల్, గ్రామాల రైతులతో గ్రామసభను నిర్వహించారు. సమావేశంలో తహసీల్దార్ నాగమణి, డీటీ మారుతి రీసర్వే డీటీ మహేశ్వరరెడ్డి, రైతులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉప కారాగారం తనిఖీ

ఆళ్లగడ్డ జూలై 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉప కారాగారాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి బుధవారం తనిఖీ చేశారు. ఖైదీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్థిక స్తోమత లేని వారికి ప్రభుత్వమే న్యాయవాదిని నియమించి ఉచిత న్యాయ సేవను అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ సెల్వం, వైద్యాధికారి నాగమస్తన్, ప్యానల్ అడ్వకేట్ షాహినా బేగం పాల్గొన్నారు.

వేలంలో రూ.75.12 లక్షల ఆదాయం

బనగానపల్లె, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌడేశ్వరీమాత ఆలయ ప్రాంగణంలో బుధవారం ఈవో శ్రీనివాసరెడ్డి, కమిటీ చైర్మన్ పీపీ.కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. చీరల వేలం షీల్డ్ కొటేషన్ ద్వారా నిర్వహించిన బహిరంగ వేలంలో ఆలయానికి రూ.75.12 లక్షల ఆదాయం లభించినట్లు ఈవో తెలిపారు. గత ఏడాది కంటే రూ.24.56 లక్షల ఆదాయం అధికంగా లభించిందన్నారు. అలాగే పులగ బియ్యం వేలాన్ని వాయిదా వేసినట్లు ఈవో తెలిపారు. గ్రామ పెద్దలు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. 11న శ్రీచౌడేశ్వరీ మాతకు సారె సమర్పణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఈవో శ్రీనివాసరెడ్డి బుధవారం తెలిపారు.